www.flashindianews.com

FLASH INDIA NEWS
ప్రతిక్షణం.. ప్రజలకోసం...

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

**విలేకరులు కావలెను**

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్టంలోని జిల్లాలు,నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక : 152 | ఆదివారం 19.07.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

## చరిత్ర సృష్టించిన

# విక్రమ్-1..



35 నిమిషాల ఆలస్యానంతరం విజయవంతమైన ప్రయోగం

సాంకేతిక పేలోడ్‌లతో పాటు 'స్కోప్' ప్రయోగం విజయవంతం

- 'మిషన్ ఆగమన్'తో ప్రైవేట్ స్పేస్ యుగంలోకి భారత్
- సాంకేతిక లోపాన్ని అధిగమించి విజయపథంలో విక్రమ్-1
- 3డీ ప్రింటెడ్ ఇంజిన్లు.. కార్బన్ కాంపోజిట్ నిర్మాణంతో ఆధునిక రాకెట్
- 350 కిలోల ఉపగ్రహాలను లో ఎర్త్ ఆర్బిట్‌లోకి చేర్చే సామర్థ్యం
- ప్రధాని మోదీ 'వందేమాతరం' పోస్ట్‌కార్డ్‌కు అంతరిక్ష ప్రయాణం
- శాస్త్రవేత్తలు, వ్యోమగాముల చేతిరాత సందేశాలకు ప్రత్యేక స్థానం
- సాంకేతిక పేలోడ్‌లతో పాటు 'స్కోప్' ప్రయోగం విజయవంతం
- ప్రైవేట్ రంగం సత్తా చాటిన చారిత్రాత్మక ప్రయోగం
- భవిష్యత్ వాణిజ్య ప్రయోగాలకు కీలక డేటా సేకరణ

05

'విక్రమ్-1' విజయంపై ప్రధాని మోడీ హర్షం

స్కైరూట్ 'విక్రమ్-1' విజయం తెలంగాణకు గర్వకారణం: సీఎం రేవంత్ రెడ్డి

అంతరిక్ష రంగంలో విక్రమ్-1 సరికొత్త మైలురాయి: పవన్ కళ్యాణ్

'విక్రమ్-ఎస్' నుంచి 'విక్రమ్-1' వరకు విజయగాథ

# పదేళ్లలో ఒక్క ఉద్యోగం ఇవ్వలేదు

## నా కుటుంబానికి పెద్దన్న అందెశ్రీ

అందెశ్రీ, గద్దరన్నతో పెట్టుకున్న వారు కాలగర్భంలో కలిసి పోయారు

### దొరల గడప తొక్కని కవి అందెశ్రీ



- నిర్బంధించిన పాటే నేడు రాష్ట్ర గీతం
- అందెశ్రీ స్మృతివనానికి సీఎం శంకుస్థాపన
- తెలంగాణ ఉద్యమానికి అందెశ్రీ గానమే స్ఫూర్తి
- అందెశ్రీ, గద్దర్‌ను అవమానించారని సీఎం విమర్శ
- గతంలో కేసీఆర్ కుటుంబ సభ్యులే లాభపడ్డారు
- నిరుద్యోగులను ఏనాడు పట్టించుకోలే
- పదేళ్లలో ఒక్క గ్రూప్ 1 ఉద్యోగం ఇవ్వలేదు
- కేసీఆర్ హయాంలో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారు
- తెలంగాణ ఉద్యమకారులను మా ప్రభుత్వం గౌరవిస్తోంది
- ఆర్థిక ఇబ్బందులు ఉన్నా హామీలు అమలు చేస్తున్నాం

02

## మెట్ట పంటల సాగుపై దృష్టి సారించాలి




- ఎల్‌నినో ప్రభావం.. పంటల మార్పుపై మంత్రి సూచనలు
- తక్కువ నీటి పంటల సాగుకు రైతులకు పిలుపు
- వరికి బదులు మెట్ట పంటలు సాగు చేయాలి
- మారుతున్న వాతావరణానికి అనుగుణంగా సాగు మార్చుకోండి
- రైతులు శాస్త్రీయ సాగు పద్ధతులు అనుసరించాలి
- రూ.4.61 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- కూసుమంచిలో అభివృద్ధి పనులకు మంత్రి శ్రీకారం
- 177 మందికి సంక్షేమ పథకాల చెక్కుల పంపిణీ
- సీఎంఆర్ఎఫ్, కళ్యాణలక్ష్మి చెక్కులు అందజేత

03

## కల్తీల నిరోధానికి కఠిన చట్టం

ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా కొత్త చట్టం



సేంద్రియ ఉత్పత్తులపై పటిష్ఠ పర్యవేక్షణకు చర్యలు

రసాయనాల వినియోగంపై సీఎం ఆందోళన

కల్తీపై ప్రజాభిప్రాయాలతో కొత్త చట్టం

పైలట్ ప్రాజెక్టుగా క్యూర్ ప్రాంతం ఎంపిక

కల్తీ నియంత్రణకు సమగ్ర బిల్లుపై సీఎం సమీక్ష

03

### గురుకుల విద్యార్థులే తెలంగాణకు భవిష్యత్ బ్రాండ్ అంబాసిడర్లు

పేదింటి పిల్లల కలలను నిజం చేస్తున్న గురుకులాలు

నీట్ ర్యాంకర్లు, స్వర్ణ పతక విజేతకు సీఎం అభినందనలు

## రేవంత్ గుర్తు పెట్టుకో..

### నోటిఫికేషన్ కాదు.. లూటిఫికేషన్



రెండేళ్ల పోరాటం.. కేంద్రం మెడలు వంచి 95% రిజర్వేషన్ల సాధన

- ఉద్యోగ హామీలపై కాంగ్రెస్‌ను నిలదీసిన కేటీఆర్
- 70 వేల ఉద్యోగాలపై కాంగ్రెస్‌కు కేటీఆర్ సవాల్
- యువతను మోసం చేసిందంటూ కాంగ్రెస్‌పై ఆగ్రహం
- జాబుల క్యాలెండర్ కాదు.. జేబుల క్యాలెండర్
- కొలువుల కుంభమేళా కాదు.. కుంభకోణాల కుంభమేళా
- రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ తీవ్ర విమర్శలు
- ఉద్యోగాల పేరుతో మోసం జరిగిందన్న కేటీఆర్
- 95 శాతం రిజర్వేషన్ల ఘనత కేసీఆర్‌దే
- కాంగ్రెస్ హామీలపై యువత ఆగ్రహం వ్యక్తం


03



## ఫలించిన పాటిల్ చర్చలు..

- బండి-ఈటల విభేదాలకు హైకమాండ్ ఫుల్‌స్టాప్
- లక్ష్మణ్ ఇంట్లో బీజేపీ అగ్రనేతల సయోధ్య
- ఆలింగనంతో ముగిసిన బండి-ఈటల విభేదాలు
- బీజేపీలో వర్గపోరుకు హైకమాండ్ చెక్
- అభయ్ పాటిల్ చొరవతో బండి-ఈటల కలయిక
- తెలంగాణ బీజేపీలో విభేదాలకు తెరపడిందా?

03



## ఆరేళ్ల క్రితం ప్రేమ పెళ్లి..

### డ్రైవర్‌తో ఎఫైర్.. భర్తను పాముతో కరిపించి చంపేసిన భార్య



నిద్రమాత్రలు ఇచ్చి.. బెడ్‌పై పామును వదిలి

- స్కూల్ డ్రైవర్‌తో ఎఫైర్.. భర్తకు విషాదాంతం
- ఇన్సూరెన్స్ డబ్బుకోసం భర్తను హత్య చేసిన భార్య
- పాము ఫొటోతో నిందితుల అసలు ప్లాన్ బయటపడింది
- కాల్ డేటాతో వెలుగులోకి వచ్చిన హత్య కుట్ర
- పాముకాటు నాటకానికి పోలీసుల దర్యాప్తుతో తెర
- ప్రేమ వివాహం.. అక్రమ సంబంధంతో దారుణ హత్య
- మొబైల్ ఫొటోతో హత్య మిస్టరీ ఛేదించిన పోలీసులు

05

ఇన్సూరెన్స్ డబ్బు కోసం దారుణ హత్య



# నల్లా నీళ్లు.. వస్తలేవ్!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** వానాకాలంలోనూ గ్రేటర్ హైదరాబాద్ దాహంతో విలవిల్లాడుతోంది. మునుపెన్నడూ లేనివిధంగా నగరవాసులు గుక్కెడు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జలమండలి అధికారులు రోజు విడిచి రోజు నీటి సరఫరా చేస్తున్నామని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి వేరేగా ఉంది. దాదాపు నాలుగు నుంచి వారం రోజులకు ఒకసారి కానీ నీళ్లు వస్తున్నాయని నగర ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా నీటి ఒత్తిడీ (ప్రెజర్) తీవ్రంగా పడిపోవడంతో గంటపాటు సరఫరా చేసినా కుటుంబ అవసరాలకు సరిపడా నీరు రావడం లేదని వాపోతున్నారు. దీంతో నల్లాల నుంచి బుస్ బుస్ అనే సౌండ్స్ తప్పా నీళ్లు రావడం లేదని మహిళలు తిట్టిపోస్తున్నారు. ఇక.. ఇదే అదునుగా భావించిన ప్రైవేటు నీటి ట్యాంకర్ల యజమానులు మాత్రం దండిగా దండుకుంటున్నారు. తెల్లవార్లూ అదే పనిగా ట్యాంకర్లను తిప్పుతూ నీటి
వ్యాపారం జోరుగా చేస్తున్నారు. ప్రభుత్వం మాత్రం తాగునీటి కష్టాలు తీర్చేందుకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదనే వాదనలు బస్తీ జనం నుంచి వినిపిస్తున్నాయి.వానాకాలంలోనూ గ్రేటర్ హైదరాబాద్ తీవ్ర తాగునీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. గడిచిన నెల రోజులుగా వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో భూగర్భ జలాలు వేగంగా అడుగంటాయి. ఫలితంగా భాగ్య నగరంలోని వేలాది బోర్లు ఎండిపోగా, అపార్ట్మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, బస్తీలు అన్న తేడా లేకుండా జలమండలి నీటిపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సరఫరా తగ్గిపోవడంతో ప్రైవేట్ డా ట్యాంకర్ల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా మారింది. జలమండలి ట్యాంకర్ల కోసం రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### 35 రోజులకే సరిపడా నిల్వలు?

నగరానికి ప్రధాన ఆధారమైన సింగూరు జలాశ యంలో ప్రస్తుతం పరిమిత నీటి నిల్వలే ఉన్నాయని జలవనరుల వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఉన్న నీరు మరో 35 రోజుల అవసరాలకు మాత్రమే సరిపోతుందనే అంచనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. భారీ వర్షాలు కురిసి జలాశయాలు నిండితేనే పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉందని ర నిపుణులు సూచిస్తున్నారు.

### అరకొరగా నీటి సరఫరా

గ్రేటర్లో 14 లక్షలకు పైగా తాగునీటి కనెక్షన్లు ఉండగా, నగర విస్తరణకు అనుగుణంగా నీటి సరఫరా పెరగకపోవడంతో సంక్షోభం తీవ్రమవుతోంది.నగరానికి ప్రతిరోజూ కృష్ణా, గోదావరి, సింగూరు, మంజీరా, ఉస్మాన్సాగర్,హిమాయత్సాగర్ల నుంచి సుమారు 2,650 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ, ప్రస్తుత జనాభా అవసరాలకు అది ఏమాత్రం సరిపోవడం లేదు. అనేక ప్రాంతాల్లో గంటపాటు నీరు వదిలినా 200 నుంచి 400 లీటర్లకే పరిమితవవుతుండటంతో కుటుంబ అవసరాలు తీరడం లేదు.

### ట్యాంకర్లకు విపరీత డిమాండ్

నీటి కొరతతో జలమండలి ట్యాంకర్ల బుకింగ్లు రికార్డు స్థాయికి చేరాయి. ఏప్రిల్ నుంచి పెరుగుతున్న డిమాండ్ మే, జూన్ నెలల్లో మరింత అధికమైంది. జూలై తొలి రెండు వారాల్లోనే లక్షకు పైగా జలమండలి ట్యాంకర్లు బుక్ అయ్యాయి. ప్రైవేట్ ట్యాంకర్ల బుకింగ్లు కూడా భారీగా పెరగడంతో వాటి ధరలు అమాంతం పెరిగాయని వినియోగదారులు చెబుతున్నారు.

### అడుగంటిన భూగర్భ జలాలు

వర్షా భావ ప్రభావంతో నగరంలో భూగర్భ జలమట్టాలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయి.మే నెలతో పోలిస్తే జూలై నాటికి సగటు భూగర్భ జలమట్టం 14 మీటర్ల లోతుకు చేరినట్లు అధికారులు గుర్తించారు.ఫలితంగా ఇళ్లలోని బోర్లు, అపార్ట్మెంట్ల బోర్వెల్లు ఎండిపోతుం డటంతో వేలాది
కుటుంబాలు పూర్తిగా జలమండలి సరఫరాపైనే ఆధారపడుతున్నాయి.ఫలితంగా ఇళ్లలోని బోర్లు, అపార్ట్మెంట్ల బోర్వెల్లు ఎండిపోతుండటంతో వేలాది కుటుంబాలు పూర్తిగా జలమండలి సరఫరాపైనే ఆధారపడుతున్నాయి.

# పదేళ్లలో ఒక్క ఉద్యోగం ఇవ్వలేదు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** అందెశ్రీ గానాలు తనలో స్ఫూర్తిని నింపాయని అన్నారు. అందె శ్రీ తన పెద్దన్న అని ఆయనే తనకు స్ఫూర్తి అని చెప్పారు. అందెశ్రీ రచించిన జయజయహే తెలంగాణ రాష్ట్రగీతంగా మారి బడుల్లో, గుడుల్లో మోగుతుందని అంతా భావించారని కానీ దొర అహంకారంతో అందెశ్రీ పాటను, మాటను నిర్బంధించారని ఆరోపించారు. అందెశ్రీ స్మృతివనం భూమిపూజ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. పెన్నుల మీద మన్ను కప్పితే అవి గున్నలై మొలకెత్తినట్టు ఆ నిర్బంధం నుండి తెంచుకుని ప్రతిగుడిలో, బడిలో అందెశ్రీ పాట వినిపిస్తుందని అన్నారు. అందెశ్రీ, గద్దర్ లాంటి యుద్ధనౌకలతో పెట్టుకున్నోడు కాలగర్భంలో కలిసిపోతాడని ఆ రోజే చెప్పామన్నారు.అందెశ్రీ కుటుంబాన్ని నడిపేందుకు కష్టపడినా దొరల మోకాళ్ల వద్ద మోకరిల్లను అని అన్నాడని చెప్పారు. ప్రజలపై ఆధిపత్యం చెలాయించాలని కొందరు చూశారని, తెలంగాణను తమ కుటుంబమే తరతరాలు పాలించాలని భావించారన్నారు. అలాంటి సమయంలోనే అందెశ్రీ లాంటివాళ్లు వచ్చారన్నారు. ఈరోజు మేకతోలు కప్పుకున్న తోడేళ్ల లాంటి వాళ్లు బయటకు వచ్చారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ నోటిఫికేషన్ లు ఇస్తే రేవంత్ రెడ్డి ఉద్యోగాలు ఇచ్చారని మాట్లాడుతున్నారని, ఆనాడు మీ చెల్లిని నిజామాబాద్ లో ఓడిస్తే ఎమ్మెల్సీ ఉద్యోగం ఇచ్చారన్నారు.మీ బంధువు వినోద్ కుమార్ ను పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిస్తే ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ గా మూడు నెలల్లోనే ఉద్యోగం ఇచ్చారన్నారు. వందల మంది మీ బంధులకు ఉద్యోగాలు ఇచ్చారన్నారు. కానీ యువత ఉద్యోగాల కోసం ఒక్కరోజు కూడా ఆలోచించలేదన్నారు.
నోటీఫికేషన్ లు ఇచ్చి జిరాక్స్ సెంటర్లలో ప్రశ్నాపత్రాలను పల్లి బఠాణీల్లా పంచారని ఆరోపించారు. విద్యార్థులు పదేళ్ల పాటు కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరిగి మీరు ఏనాడైనా వారి గురించి ఆలోచించారా అని అన్నారు. 2011 ఉమ్మడి రాష్ట్రంలో గ్రూప్ 1 పరీక్షలు నిర్వహిస్తే 2026లో తాము నోటిఫికేషన్ ఇచ్చి నియామకాలు చేపట్టే వరకు 16ఏళ్లు అయ్యిందని అన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే దాదాపు 70వేల ఉద్యోగాలిచ్చామని చెప్పారు.

### నా కుటుంబానికి పెద్దన్న అందెశ్రీ: సీఎం రేవంత్

తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ స్మృతివనానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అందెశ్రీతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న సీఎం, ఆయన తనకు ఆత్మబంధువని, కుటుంబ సభ్యుడిగా, పెద్దన్నగా భావించానని అన్నారు. అందెశ్రీ పాటలు లక్షలాది మందిలో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని నింపాయని, తనలోనూ ఉద్యమ చైతన్యాన్ని రగిలించాయని పేర్కొన్నారు. గడీల ముందు మోకరిల్లనని చెప్పిన కవి అందెశ్రీ ఎప్పుడూ దొరల గడప తొక్కలేదని, ఆయన గానంలో గొప్పతనం, సమాజానికి మార్గనిర్దేశం చేసే శక్తి ఉందన్నారు. ఒకప్పుడు నిర్బంధానికి గురైన అందెశ్రీ పాటే నేడు తెలంగాణ రాష్ట్ర గీతంగా మారడం చారిత్రక విషయమని చెప్పారు. ఆనాటి ప్రభుత్వం అందెశ్రీని అవమానించిందని, అలాగే ప్రజాకవి గద్దర్ను ప్రగతిభవన్ ఎదుట ఎండలో నిలబెట్టిన ఘటనను కూడా సీఎం గుర్తు చేశారు.

# రోడ్ల నిర్మాణంతో.. అభివృద్ధికి వేగం



**వికారాబాద్,ఫ్లాష్ ఇండియా :** వికారాబాద్ జిల్లాకు రోడ్ల అభివృద్ధికి గాను 900 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయడం జరిగిందని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. శనివారం తాండూర్ నియోజక వర్గంలో 290 కోట్ల వ్యయంతో రోడ్ల నిర్మాణాలు, బలోపేతం చేయడానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసనమండలిలో చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యేలు బుయ్యని మనోహర్ రెడ్డి, కాలె యాదయ్య, జిల్లా కలెక్టర్ దీపక్ తివారీలతో కలిసి రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం కందనెల్లి జెపిఆర్ గార్డెన్ లో జరిగిన సభలో రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.... రాష్ట్రంలో రోడ్ల నిర్మాణాల నిమిత్తం అత్యధిక నిధులను కేటాయించి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా తాండూరు నియోజకవర్గానికి 290 కోట్ల రూపాయలను మంజూరు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. రోడ్ల సౌకర్యం మెరుగ్గా ఉంటే పరిశ్రమలు, వ్యాపారాలు వృద్ధి చెందుతాయని అలాగే ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని ఆయన అన్నారు. మంజూరు అయిన పనులు వెంటనే చేపడతామని ఆయన అన్నారు. ప్రజా పాలన లో భాగంగా 30 మాసాల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన ప్రతి పేదవాడికి రేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు సన్న బియ్యాన్ని ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. 500 రూపాయల సబ్సిడీతో గ్యాస్ సిలిండర్లను ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి మహిళా సంఘాలకు 10 లక్షల రూపాయల వరకు వడ్డీ లేని రుణాలు ఇవ్వడం జరుగుతుందని మంత్రి తెలిపారు. రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లోనే 900 కోట్ల రూపాయలను రైతుల ఖాతాలకు జమ చేయడం జరిగిందని ఆనీ సందర్భంగా తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలను పటిష్ట పరిచే దిశగా యంగ్ ఇండియా పాఠశాలలను స్థాపించడం జరుగుతుందని మంత్రి అన్నారు.కోర్టు కేసు పరిష్కారం అయిన వెంటనే 94 కోట్ల వ్యయంతో రైల్వే ఓవర్ వే బ్రిడ్జి పనులను 18 వారాల్లో చేపడతామని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... ఆర్థిక వ్యవస్థను మెరుగుపరుస్తూనే వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. 261 కోట్ల వ్యయంతో ప్రధాన రహదారులను నిర్మించేందుకు శంకుస్థాపన చేసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. రవాణా వ్యవస్థ మెరుగుపరిస్తేనే అభివృద్ధి సాధ్యమని మంత్రి అన్నారు. కాగ్న నదిలో మురుగునీరు కలవకుండా 30 కోట్లను మంజూరు చేసి పనులు మొదలు పెట్టడం జరిగిందని మంత్రి అన్నారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల రూపాయలను మాఫీని ప్రభుత్వం చేపట్టిందన్నారు. గ్రూప్-1, గ్రూప్-2 తదితర పరీక్షలు నిర్వహించి 70 వేల మందికి ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పించదని మందు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తూనే ఉదయం అల్పాహారం సౌకర్యాన్ని కల్పించడం జరిగిందని ఆయన అన్నారు. తాండూర్ మున్సిపల్ పరిధిలో 571 మంది అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా డబుల్ బెడ్ రూమ్ లను కేటాయించడం జరిగిందని మంత్రి తెలిపారు మంత్రి తెలిపారు.అంతర్గత మురుగు కాలువల సమస్యలపై ప్రణాళికలు సిద్ధం చేస్తే అనుమతులు ఇస్తామని మంత్రి అన్నారు. శాసన మండలి చీఫ్ విప్ పి.మహేందర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వం పేదల అభ్యున్నతి కృషి చేస్తూ ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేయబడుతుందన్నారు. వికారాబాద్ రంగారెడ్డి జిల్లాల రోడ్ల అభివృద్ధికి అధిక నిధులు ఇచ్చారని, రోడ్ల అభివృద్ధితో రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని ఆయన అన్నారు. కర్ణాటక సరిహద్దు రోడ్లకు నిధులను కేటాయించి అభివృద్ధి చేయవలసిన అవసరం ఉందని ఆయన అన్నారు. స్థానిక శాసనసభ్యులు బుయ్యాని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.... తాండూర్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ద్వారా అధిక నిధులను తీసుకురావడం జరుగుతుందన్నారు. మైనార్టీ సంక్షేమం కోసం 75 కోట్ల వ్యయంతో ఏటీసీని ఏర్పాటు చేసుకోవడం జరిగిందని గత సంవత్సరం 165 మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. బషీరాబాద్ రోడ్ల అభివృద్ధియే కాకుండా 30 పడకల ఆసుపత్రి, జూనియర్ కళాశాలలను మంజూరు చేయడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఉమాశంకర్ ప్రసాద్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఇ.వెంకటాచారి, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, ఆర్డిఓ అనిత, ఆర్ అండ్ బి ఎస్.ఇ వసంత నాయక్, ఆర్య వైశ్య కార్పొరేషన్ సంస్థ చైర్ పర్సన్ కల్వ సుజాత, మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి, కందనెల్లి సర్పంచ్ యాదమ్మ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.1400 కోట్లు ఎక్కడివో స్వంత చెల్లికి సమాధానం చెప్పు



**సిద్దిపేట,ఫ్లాష్ ఇండియా :** మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై మంత్రి వివేక్ వెంకటస్వామి తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ లో ఎలినో ప్రభావం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ...సరూర్ నగర్ సభలో తెలంగాణ ప్రజలు విదేశాలకు ఎందుకు వెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మీ పిల్లలు విదేశాల్లో చదువుకోవాలని కానీ సామాన్యుల పిల్లలు విదేశాల్లో చదువుకో వద్దా అని సూటిగా ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబ సభ్యులకే పదవులు దక్కింది నిజం కాదా అన్నారు. పేదలకు మంచి చేయాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి తాపత్రయం అన్నారు. కేటీఆర్ మాత్రం ప్రభుత్వాన్ని దించాలని మనసులో పెట్టుకొని ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం
రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఖాతాలో ఉన్న రూ.14 వందల కోట్ల ఎలా వచ్చాయో అని అడుగుతున్నా స్వంత చెల్లి కల్వకుంట్ల కవితకు కేటీఆర్ సమాధానం చెప్పాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.






ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా
మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# బహద్దూర్ గుడాలో హైటెన్షన్...!



**శంషాబాద్,ఫ్లాష్ ఇండియా :** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని బహదూర్ గూడ రణరంగంగా మారింది. గ్రామంలోని 650 ఎకరాలను స్వాధీనం చేసుకునేందుకు పూనుకున్న ప్రభుత్వం హైడ్రాను రంగంలోకి దించింది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయమే వందలాది మంది పోలీసులు, అదేవిధంగా హైడ్రా రెవెన్యూ అధికారులు గ్రామానికి చేరుకున్నారు. గ్రామంలోని సర్వే నెంబర్ 28లో 150 ఎకరాలు, సర్వే నెంబర్ 62లో 500 ఎకరాలు మొత్తం 650 ఎకరాలకు సంబంధించి ప్రభుత్వానికి రైతులకు మధ్య వివాదం చాలా సంవత్సరాలుగా కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో 650 ఎకరాలను ఆధీనంలోకి తీసుకునేందుకు 10-07-2026 నాడు రాజేంద్రనగర్ ఆర్డిఓ హైడ్రాధికారులకు లేఖ రాశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు భారీ సంఖ్యలో పోలీసులు హైడ్రా రెవెన్యూ అధికారులు బహదూర్ గూడ గ్రామానికి చేరుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో తమ భూములను ఇవ్వబోమని కొన్ని రోజులుగా దీక్షలు చేపట్టారు. వారికి పలు పార్టీల నేతలు సంఘీభావం ప్రకటించారు. శనివారం ఉదయం నుంచి భారీ యంత్రాలతో హైడ్రా అధికారులు ఫెన్సింగ్ పనులు చేపట్టారు. రైతులు అడ్డుకునే యత్నం చేయగా పోలీసులు వారిని నిలువరించారు. నేపథ్యంలో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. తమకు సరైన పరిహారం ప్రకటించిన తర్వాతనే హైడ్రాధికారులు తమ భూములను స్వాధీనం చేసుకోవాలని రైతులు డిమాండ్ చేయసాగారు. వారి డిమాండ్లను ఏ మాత్రం పట్టించుకోకుండా అధికారులు ఫెన్సింగ్ పనులు చేస్తున్నారు.

**నేతల అరెస్ట్..**

బహదూర్ గూడ రణరంగంగా మారడంతో గ్రామానికి ఎవరిని రాకుండా పోలీసులు అడ్డుకుంటున్నారు. బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోకల శ్రీనివాస్ రెడ్డిని మైలర్ దేవుపల్లిలోని ఆయన ఇంటి వద్ద పోలీసులు అడ్డుకున్నారు. బహదూర్ గూడ గ్రామానికి చేరుకున్న రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డిని పోలీసులు గ్రామంలో అడ్డుకున్నారు. ఈ పద్యంలో గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# మెట్ట పంటల సాగుపై దృష్టి సారించాలి

**కూసుమంచి,ఫ్లాష్ ఇండియా :** ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో రైతులు సంప్రదాయ సాగు విధానాలపై మొండిపట్టు వీడి, మారుతున్న ప్రకృతి పరిస్థితులకు అనుగుణంగా సాగు విధానాలను మార్చుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచించారు. అధిక నీటి అవసరం ఉండే పంటల సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ మెట్ట పంటలపై దృష్టి సారించాలని రైతులకు పిలుపునిచ్చారు. శనివారం పాలేరు నియోజకవర్గ పరిధిలోని కూసుమంచి మండలంలో మంత్రి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**రూ.4.61 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన..**

మండల పర్యటనలో భాగంగా మల్లాయిగూడెంలో రూ. 2.52 కోట్లతో పెరికసింగారం ఎన్ఎస్పీ కెనాల్ నుంచి భగవాన్ తండా మీదుగా మల్లాయిగూడెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. అలాగే రూ. 20 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం కోక్యా తండాలో రూ. 1.69 కోట్లతో లింగారం తండా నుంచి లోక్యా తండా ఎన్ఎస్పీ కాలువ వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అగ్రహారంలో రూ. 20 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనానికి కూడా భూమిపూజ నిర్వహించారు. మొత్తం రూ. 4.61 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు.

**177 మంది లబ్ధిదారులకు సంక్షేమ చెక్కుల పంపిణీ..**

అనంతరం కూసుమంచిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సంక్షేమ పథకాల లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 66 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు. అలాగే వివిధ అనారోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 111 మంది బాధితులకు రూ. 35.16 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు.

**రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది..**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతుల పక్షాన నిలుస్తోందని చెప్పారు. ఇప్పటికే రైతు భరోసా ద్వారా అన్నదాతలకు ఆర్థిక అండ అందించామని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ సాగు విధానాల్లో మార్పులు చేసుకోవాలని రైతులకు సూచించారు. అధిక నీటి అవసరమయ్యే వరి వంటి పంటలకు బదులుగా జొన్న, సజ్జ, రాగులు, పెసర, మినుము, కంది, నువ్వులు వంటి తక్కువ నీటితో సాగయ్యే మెట్ట పంటల సాగును ప్రోత్సహించాలని అన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తే నష్టాలను తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు.

**పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం..**

ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల జారీ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ పూర్తయిందని, త్వరలో రెండో విడత ఇళ్లను మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం మూడో, నాలుగో విడతల్లో కూడా అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. రైతు భరోసా పథకం కింద ఎకరాకు రూ. 6 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేశామని, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.

**పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు..**

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, పీఆర్ ఈఈ వెంకట్‌రెడ్డి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, కూసుమంచి తహసీల్దార్ సైదులు, ఎంపీడీవో సిలార్ సాహెబ్, మద్దినేని స్వర్ణకుమారి, వివిధ గ్రామాల సర్పంచులు, క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సీడీసీ చైర్మన్ ఎరబోలు సూర్యనారాయణరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బజ్జూరి వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ బానోత్ శ్రీనివాస్ నాయక్, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కల్తీల నిరోధానికి కఠిన చట్టం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఆహార, ఔషధాల్లో కల్తీల నిరోధానికి కఠిన చట్టం రూపొందించాలని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు అధికారులను ఆదేశించారు. నిత్యావసరాలు, కూరగాయలు, పండ్లు, పాలు అన్నీ కల్తీ అవుతుండటంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని ముఖ్యమంత్రి గారు పేర్కొన్నారు. తెలంగాణ ఆహార కల్తీ, ఔషధ నియంత్రణ చట్టం పై ఎంసీహెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి గారు సమీక్ష నిర్వహించారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు, పండ్లు త్వరగా మగ్గేందుకు విచ్చలవిడిగా రసాయనాలు వినియోగిస్తుండటంతో ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడుతోందని ముఖ్యమంత్రి గారు తెలిపారు. ఎరువులు, పురుగు మందుల అధిక వినియోగంతో పంట ఉత్పత్తుల్లో రసాయన అవశేషాలు బయట పడుతున్నాయని, దీంతో కొన్ని దేశాలు దిగుమతులకు నిరాకరిస్తున్న విషయాన్ని ముఖ్యమంత్రి గారు ప్రస్తావించారు. మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తుల పేరుతో పలు రకాల ఉత్పత్తులు విక్రయిస్తున్నారని, అధిక ధరలు చెల్లించి ప్రజలు వాటిని కొనుగోలు చేస్తున్నప్పటికీ అవి నిజంగా సేంద్రియ ఉత్పత్తులేనా అనే విషయాన్ని నిర్ధారించేందుకు సరైన వ్యవస్థలు లేవని ముఖ్యమంత్రి గారు పేర్కొన్నారు. కల్తీల నిరోధానికి సమగ్ర చట్టాలు అమలులో ఉన్న దేశాలను సందర్శించి అక్కడి విధానాలను అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి గారు అధికారులకు సూచించారు. ఆయా అధ్యయనాల ఆధారంగా సమగ్ర నివేదికను రూపొందించాలని ఆదేశించారు. ఆ నివేదిక ఆధారంగా బిల్లును రూపొందించి శాసనసభలో సమగ్ర చర్చ చేపడతామని ముఖ్యమంత్రి గారు తెలిపారు. శాసనసభలో చర్చతో పాటు ప్రజల నుంచి అభిప్రాయాలు కూడా స్వీకరించాలని సూచించారు. కల్తీలకు సంబంధించి సమగ్ర సమాచారం సేకరించేందుకు విజిల్ బ్లోయర్ వ్యవస్థను, టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. కల్తీల నిరోధానికి ముందుగా క్యూర్ ప్రాంతాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని ముఖ్యమంత్రి గారు అధికారులను



ఆదేశించారు. అక్కడ నిబంధనలను అమలు చేసి, వాటి అమలులో ఎదురయ్యే లోటుపాట్ల ఆధారంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గారు, రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ గారు, ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు గారు, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీలు వి.శేషాద్రి గారు, ఎన్.శ్రీధర్ గారు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# ఫలించిన పాటిల్ చర్చలు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్ర బీజేపీలో ఇద్దరు కీలక నేతల మధ్య తలెత్తిన విభేదాలు.. పొలిటికల్ హీట్ ను పెంచాయి. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్రమైన చర్చకు దారితీసింది. బీసీ నేతలు, ఎంపీలు అయిన బండి సంజయ్, ఈటల రాజేందర్ ల మధ్య అభిప్రాయ బేధాలు తలెత్తాయి. ఇవి క్రమంగా వర్గపోరుకు దారితీసేలా ఉండటంతో.. అధిష్టానం ఇద్దరి మధ్య సయోధ్య కుదిర్చే ప్రయత్నం చేయగా.. అది ఫలించింది. ఇందుకు తెలంగాణ బీజేపీ సీనియర్ నేత, రాజ్యసభ ఎంపీ కె.లక్ష్మణ్ ఇల్లు వేదికైంది. లక్ష్మణ్ ఇంట్లో ఇద్దరికీ విందు ఏర్పాటు చేయగా.. బీజేపీ జాతీయ నేత అభయ్ పాటిల్ ఈ విందుకు విచ్చేశారు. ఇద్దరు అగ్రనేతల మధ్య ఉన్న మనస్పర్థలపై మాట్లాడి.. వాటిని తొలగించి, ఒకే తాటిపైకి తీసుకొచ్చారు. బండి సంజయ్ తనకు, తన వర్గంవారికి పదవులు రాకుండా చేస్తున్నారని, రాష్ట్రంలో సరిగ్గా తిరగనివ్వడంలేదని ఈటల... తన అధ్యక్ష పదవి పోవడానికి ఈటల రాజేందరే కారణమని బండి సంజయ్ లు ఆరోపణలు చేసుకున్నట్లు వార్తలొచ్చాయి. అయితే ఎంపీ లక్ష్మణ్ ఇంటిలో పాటిల్ తో సమావేశం తర్వాత వీరిద్దరూ ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ మీడియా ముందుకు వచ్చారు. ఇద్దరి మధ్య హైకమాండ్ పాటిల్ తో జరిపించిన చర్చలు ఎట్టకేలకు ఫలించినట్లైంది. భవిష్యత్తులో తెలంగాణలో బీజేపీని మరింత అధికార దిశగా తీసుకెళ్లేందుకు, గ్రేటర్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు ఇద్దరూ కలిసికట్టుగా, వ్యూహాత్మకంగా పనిచేయాలని ఈ భేటీలో నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని.. పాటిల్ ఇరువురికీ సూచించినట్లు సమాచారం. కాగా.. వచ్చే ఎన్నికల నాటికి రాష్ట్రంలో అసెంబ్లీ, లోక్ సభ సీట్లు పెరుగుతాయని ఎంపీ లక్ష్మణ్.. ఈ భేటీ అనంతరం తెలిపారు.



# గురుకుల విద్యార్థులే తెలంగాణకు భవిష్యత్ బ్రాండ్ అంబాసిడర్లు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** గురుకుల విద్యార్థులే తెలంగాణకు భవిష్యత్ బ్రాండ్ అంబాసిడర్లు అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. తెలంగాణలోని గురుకులాలు పేద పిల్లల కలలను నిజం చేస్తున్నాయన్నారు. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో చదివి నీట్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో పాటు, చైనాలోని ఓర్డోస్‌లో నిర్వహించిన తొలి ఆసియా అండర్-23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2026లో మహిళల 4×400 మీటర్ల రిలే పోటీలో భారత జట్టులో కీలకంగా వ్యవహరించి స్వర్ణ పతకాన్ని సాధించేందుకు కృషి చేసిన సాయి ప్రవళిక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శనివారం కలిశారు. వారిని సీఎం రేవంత్ అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. పేదరికం ప్రతిభకు ఎప్పుడూ అడ్డంకి కాదని, సరైన అవకాశం, నాణ్యమైన విద్య, ప్రభుత్వ అండ ఉంటే గురుకుల విద్యార్థులు ప్రపంచ స్థాయిలోనూ సత్తా చాటగలరని పేర్కొన్నారు. గురుకులాల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి విజయం వెనుక ప్రభుత్వ సంస్కరణలు, సీఎం రేవంత్ రెడ్డి దూరదృష్టి, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల విశ్వాసం కలిసి ఉన్నాయన్నారు. ఈ విజయాలు ఒక్క విద్యార్థుల కుటుంబాలకు మాత్రమే కాదు.. తెలంగాణ సమాజానికే గర్వకారణమని పేర్కొన్నారు.

# రేవంత్ గుర్తు పెట్టుకో..

## హిట్లర్ కంటే దారుణంగా నీక్లైమాక్స్

**సరూర్ నగర్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో నోటిఫికేషన్ కాదు లూటీఫికేషన్ నడుస్తోందని, జిత్తుల మారిన కాంగ్రెస్ యువతను మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ విమర్శించారు. కాంగ్రెస్ నేతలు జాబుల క్యాలెండర్ వదిలేసి జేబులు నింపుకుంటున్నారని దుయ్యబట్టారు. కొలువుల కుంభమేళా అని చెప్పి కుంభకోణాల కుంభమేళా చేపడుతున్నారని మండిపడ్డారు. ఇవాళ సరూర్ నగర్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సులో మాట్లాడిన ఆయన.. కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా నెరవేరిందా? అని ప్రశ్నించారు. 70 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు నోటిఫికేషన్తో సహా నిరూపిస్తే తాను శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుని రాహుల్ గాంధీకి జై కొడతానన్నారు. కాంగ్రెస్ చేసిన మహా ద్రోహాన్ని గుర్తు చేసుకోవడానికే ఈ సమావేశం అని జంగ్ సైరన్ మోగించడానికి యంగ్ తరంగ్ ఇక్కడికి తరలి వచ్చిందన్నారు.

**ఇప్పటివరకు ఒక లెక్క ఇకనుంచి మరో లెక్క:**

కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రపంచంలోనే అతిపెద్ద మోసం అని ఉద్యోగాలు అడిగితే యువతను ఉరికిచ్చి కొడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. పోలీసు ఉద్యోగాలు అడిగితే ఎండ్రిన్ తాగి చావమంటారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నమ్మించి మోసం చేయడంలో రేవంత్ రెడ్డి పీహెచ్‌డీ చేశారని ఇప్పటివరకు ఒక లెక్క ఇకనుంచి మరో లెక్క అన్నారు. రాహుల్ గాంధీ అశోక్ నగర్ వచ్చి అబద్ధపు మాటలు చెప్పారని, రాహుల్‌కు తెలుగు రాదు మా బాధలు అర్థం కావన్నారు. మొదటి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని మోసం చేశారు. రాహుల్.. అశోక్ నగర్ లో మీరేం మాట్లాడారో గుర్తుందా అని ప్రశ్నించారు. ఈ యువతరానికి పొట్టు పొట్టు ఆకలి ఉందని కాంగ్రెస్‌కు ఘోరీ కడతామని యువత ఒట్లు పెట్టుకుంటున్నారన్నారు. నీ క్లైమాక్స్ హిట్లర్ కంటే దారుణంగా ఉంటుంది రేవంత్ రెడ్డి గుర్తుపెట్టుకో అన్నారు. కేసీఆర్ ఇచ్చిన నోటిఫికేషన్లకు ఉద్యోగ పత్రాలు ఇచ్చి రేవంత్ రెడ్డి క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారని ఉద్యోగాలపై సీఎం, మంత్రులు పూటకో మాట మాట్లాడుతున్నారన్నారు. భూములు, బూడిద, ఇసుక లూటిఫికేషన్ జరుగుతోందన్నారు. ప్రజలు హామీలపై ప్రశ్నిస్తే అవహేళనగా మాట్లాడుతున్నారు. అవమానాలు, అవహేళనలు ప్రజలు, యువత ఎప్పటికీ మర్చిపోరన్నారు.

**రెండేళ్ల పోరాటం.. కేంద్రం మెడలు వంచి 95% రిజర్వేషన్ల సాధన**

తెలంగాణలోని స్థానిక అభ్యర్థులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 95 శాతం రిజర్వేషన్లు కల్పించే సరికొత్త జోనల్ వ్యవస్థను తీసుకురావడానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రెండున్నర సంవత్సరాల పాటు నిరంతరం కష్టపడ్డారని కేటీఆర్ గుర్తుచేశారు. ఈ 95 శాతం రిజర్వేషన్ల ప్రతిపాదనను మొదట్లో కేంద్ర ప్రభుత్వం తిరస్కరించిందని ఆయన వెల్లడించారు. అయినప్పటికీ వెనకడుగు వేయకుండా, కేసీఆర్ స్వయంగా ఢిల్లీకి వెళ్లి తెలంగాణ ఉద్యమ చరిత్రను, ఇక్కడి ప్రత్యేక పరిస్థితులను ప్రధానికి వివరించి, వారిని ఒప్పించి ఈ చారిత్రాత్మక జోనల్ విధానానికి ఆమోదం ముద్ర వేయించారని స్పష్టం చేశారు.

**తప్పులను సరిదిద్దాం.. రికార్డు స్థాయిలో ఉద్యోగాల భర్తీ**

గత తొమ్మిదిన్నర ఏళ్ల తమ పాలనలో చేపట్టిన ఉద్యోగ నియామకాలను కేటీఆర్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. టీజీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ వంటి కొన్ని పొరపాట్లు జరిగాయని ఆయన బహిరంగంగానే అంగీకరించారు. అయితే, ఆ తప్పులను కేవలం గుర్తించడమే కాకుండా, బాధ్యులైన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకున్నది కూడా తమ ప్రభుత్వమేనని ఆయన స్పష్టం చేశారు. నియామకాల గణాంకాలను వివరిస్తూ.. తమ ప్రభుత్వ హయాంలో ఏకంగా 2,32,308 ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ప్రారంభించామని, అందులో 26,083 ఉద్యోగాలను విజయవంతంగా భర్తీ చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించామని కేటీఆర్ వివరించారు.

# ఉద్యమకారులకు అండగా ఎల్లప్పుడూ ఉంటా..

పార్టీలకు అతీతంగా ఐక్యంగా ఉండండి
అమరవీరుల స్థూపం ఆవిష్కరణను విజయవంతం చేయండి
తెలంగాణ తల్లి, షోయబుల్లా ఖాన్ విగ్రహాలను సొంత నిధులతో ఏర్పాటు చేస్తా..
షాద్ నగర్ టీయూజేఏసీ నేతలు టీజీ శ్రీనివాస్, పినపాక ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలుసుకున్న ఉద్యమ కారులు
ఉద్యమ నేతలతో ఎమ్మెల్యే శంకర్ కీలక చర్చలు



**తలకొండ పల్లి ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** తెలంగాణ ఉద్యమకారులు పార్టీలకు అతీతంగా ఐక్యంగా ఉండాలని, ఉద్యమకారుల కోసం ఎలాంటి సహాయానికైనా తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో తన సొంత నిధులతో నిర్మించిన తెలంగాణ అమరవీరుల స్థూపం ఆవిష్కరణను తెలంగాణ ఉద్యమకారులందరూ కలిసి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక (టీయూజేఏసీ) నాయకులు గౌరవ అధ్యక్షుడు పినపాక ప్రభాకర్, అధ్యక్షుడు టిజి శ్రీనివాస్ నేతృత్వంలో ఆయా పార్టీలకు, సంఘాలకు, మీడియాకు చెందిన ఉద్యమకారులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అమరవీరుల స్థూపం నిర్మాణానికి అభినందనలు తెలిపారు. తెలంగాణ ఉద్యమాన్ని, ఉద్యమకారుల త్యాగాలను గౌరవిస్తూ తన సొంత నిధులతో అమరవీరుల స్థూపాన్ని నిర్మించడం ద్వారా ఉద్యమంపై తనకున్న నిబద్ధతను చాటుకున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా టీయూజేఏసీ నాయకులు మాట్లాడుతూ, ధ్వంసమైన తెలుగుతల్లి విగ్రహం స్థానంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, తెలంగాణ రైతాంగ పోరాటంలో కలాన్ని గన్నుగా మార్చి పోరాడిన మహనీయుడు షోయబుల్లా ఖాన్ విగ్రహాన్ని కూడా ప్రతిష్ఠించాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన ప్రతి ఉద్యమకారుడిని గుర్తించి వారికి తగిన గౌరవం కల్పించేలా కృషి చేస్తానన్నారు. ఉద్యమకారులు ఏ సమస్యతో వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు. అలాగే అమరవీరుల స్థూపం ఆవిష్కరణ కార్యక్రమం పూర్తయిన వెంటనే టీయూజేఏసీ నాయకులు కోరిన మేరకు తెలంగాణ తల్లి మరియు షోయబుల్లా ఖాన్ విగ్రహాలను కూడా తన సొంత నిధులతో ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. రేపు జరిగే అమరవీరుల స్థూపం ఆవిష్కరణ కార్యక్రమానికి తెలంగాణ ఉద్యమకారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీయూజేఏసీ సలహాదారులు వంగూరి గంగిరెడ్డి, ఎండి ఖాజా పాషా (కేపీ), పంది వెంకట్రాంరెడ్డి, లట్టుపల్లి మోహన్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు పినపాక ప్రభాకర్, అధ్యక్షుడు టీజీ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అనుముల శ్రీధర్ రెడ్డి, సహాయ కార్యదర్శులు జాంగారి రవి, బుద్దల జంగయ్య, అదెట్ల రాజు, కోశాధికారి కొండోజు వంశీకృష్ణ, నాయకులు బిశ్వా కృష్ణయ్య, ఎన్. రతన్ నాయక్, మూల జనార్దన్, కరుణాకర్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## నిధులు కేటాయిస్తే సరిపోదు...




మహిళలు, బాలల సంక్షేమం ఏ రాష్ట్రానికైనా అభివృద్ధి సూచిక. సమాజంలో అత్యంత సున్నితమైన వర్గాలైన మహిళలు, చిన్నారుల భద్రత, ఆరోగ్యం, విద్య, పోషకాహారం, పునరావాసం వంటి అంశాలపై ప్రభుత్వం ఎంత శ్రద్ధ చూపుతుందో, ఆ రాష్ట్ర పాలన అంత సమర్థవంతంగా ఉందని భావిస్తారు. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఏడాది మహిళలు, చిన్నారుల సంక్షేమం కోసం కోట్లాది రూపాయలను వివిధ పథకాల ద్వారా కేటాయిస్తున్నాయి. అయితే నిధులు కేటాయించడం ఒక్కటే సరిపోదు. అవి సమయానికి, లక్ష్యానికి అనుగుణంగా ఖర్చు కావడం మరింత కీలకం. తాజాగా జిల్లాల వారీగా మహిళా, శిశు సంక్షేమ పథకాల నిధుల వినియోగంపై అందుబాటులోకి వచ్చిన గణాంకాలు చూస్తే, ప్రభుత్వ సంక్షేమ యంత్రాంగంలో ఉన్న లోపాలు స్పష్టంగా బయటపడుతున్నాయి. కొన్ని జిల్లాలు వంద శాతం నిధులను వినియోగించి ఆదర్శంగా నిలిస్తే, మరికొన్ని జిల్లాలు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకపోవడం ఆందోళన కలిగించే విషయం.బాలికల రక్షణ, విద్య, సాధికారత లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'బేటీ బచావో--బేటీ పఢావో' పథకం సమాజంలో బాలికల పట్ల ఉన్న వివక్షను తగ్గించేందుకు రూపొందించబడింది. ఈ పథకం కింద ఎంపిక చేసిన ప్రతి జిల్లాకు సమానంగా రూ.4.69 లక్షల నిధులు విడుదలయ్యాయి. అయినప్పటికీ జనగామ, నాగర్‌కర్నూల్, కామారెడ్డి, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, వరంగల్, యాదాద్రి భువనగిరి, మహబూబాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, జగిత్యాల వంటి జిల్లాలు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకపోవడం ఆశ్చర్యకరం. ఇదే సమయంలో మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల్, సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాలు వంద శాతం నిధులను వినియోగించడం పరిపాలనా చిత్తశుద్ధికి నిదర్శనం. ఒకే రాష్ట్రంలో, ఒకే విధమైన మార్గదర్శకాలతో నిధులు విడుదలైనా ఇంత భారీ వ్యత్యాసం ఎందుకు ఏర్పడిందన్న ప్రశ్నకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.ఆపదలో ఉన్న పిల్లలకు అత్యవసర సహాయం అందించేందుకు ఏర్పాటు చేసిన చైల్డ్ హెల్ప్‌లైన్ వ్యవస్థ పరిస్థితి కూడా అంతే నిరాశాజనకంగా ఉంది. చిన్నారులపై హింస, బాల కార్మికత్వం, బాల్య వివాహాలు, వీధి పిల్లల సమస్యలు వంటి అత్యవసర పరిస్థితుల్లో ఈ సేవలు ప్రాణాధారంగా నిలుస్తాయి. అలాంటి కీలక విభాగంలో జయశంకర్ భూపాలపల్లి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, నారాయణపేట, పెద్దపల్లి, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలు విడుదలైన నిధులను ఖర్చు చేయకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనం. మరోవైపు హైదరాబాద్ జిల్లా తనకు విడుదలైన నిధులను పూర్తిగా వినియోగించి ఆదర్శంగా నిలవడం, సమర్థవంతమైన పర్యవేక్షణ ఉంటే నిధుల వినియోగం సాధ్యమేనని రుజువు చేస్తోంది.మహిళలు, చిన్నారుల ఆరోగ్యానికి అత్యంత కీలకమైన సంపూర్ణ పోషకాహార పథకం (ఎస్ఎన్‌పీ) అమలులోనూ జిల్లాల మధ్య తీవ్ర అసమానతలు కనిపిస్తున్నాయి. గర్భిణులు, బాలింతలు, ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు పోషకాహారం అందించడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. ఇలాంటి పథకాల్లో నిధుల వినియోగంలో జాప్యం అంటే నేరుగా ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడినట్టే. వరంగల్ రూరల్ జిల్లా రూ.1.03 కోట్లకు పైగా నిధులు పొందినా కేవలం 13 శాతం మాత్రమే ఖర్చు చేయడం, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, సూర్యాపేట జిల్లాలు కూడా 30 శాతం లోపే నిధులను వినియోగించడం ఆందోళన కలిగిస్తోంది. దీనికి భిన్నంగా నిర్మల్ జిల్లా 94 శాతం నిధులను వినియోగించి రాష్ట్రంలోనే ముందంజలో నిలవడం గమనార్హం. ఇది సంకల్పం, సమన్వయం, పర్యవేక్షణ ఉంటే ఫలితాలు సాధ్యమేనని చూపిస్తోంది.అనాథలు, నిరాశ్రయులు, సంరక్షణ అవసరమైన పిల్లల కోసం అమలు చేస్తున్న మిషన్ వాత్సల్య పథకం కూడా ప్రభుత్వ సామాజిక బాధ్యతను ప్రతిబింబిస్తుంది. అయితే ఈ పథకంలోనూ కొన్ని జిల్లాలు నిధులను సమర్థంగా వినియోగిస్తుండగా, మరికొన్ని జిల్లాలు పూర్తిగా విఫలమవుతున్నాయి. సూర్యాపేట, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాలు మంచి పనితీరు కనబరిచినప్పటికీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా విడుదలైన నిధులను ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకపోవడం విచారకరం. అనాథ పిల్లల సంరక్షణలో ఇలాంటి నిర్లక్ష్యం సమాజం అంగీకరించలేని విషయం.మహిళలపై హింసకు గురైన బాధితులకు అత్యవసర వైద్య, న్యాయ, మానసిక సహాయం అందించేందుకు ఏర్పాటు చేసిన వన్ స్టాప్ సెంటర్లు కూడా సంక్షేమ వ్యవస్థలో కీలక భాగం. ఇక్కడ కూడా హైదరాబాద్ జిల్లా వంద శాతం నిధులను వినియోగించి ఆదర్శంగా నిలిచింది. కానీ ఆదిలాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకపోవడం, మరికొన్ని జిల్లాల్లో నిధుల వినియోగం మందగించడం సేవల అందుబాటుపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉంది. మహిళల భద్రత వంటి అత్యంత ప్రాధాన్య అంశాల్లో ఇలాంటి నిర్లక్ష్యం అసలు ఉండకూడదు.ఈ గణాంకాలు ఒక స్పష్టమైన వాస్తవాన్ని చెబుతున్నాయి. సమస్య నిధుల కొరత కాదు; వాటి వినియోగంలో ఉన్న పరిపాలనా వైఫల్యం. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన తరువాత వాటిని కార్యాచరణ ప్రణాళిక ప్రకారం ఖర్చు చేయడం జిల్లా స్థాయి అధికారుల బాధ్యత. నిధులు విడుదలై నెలలు గడిచినా ఖర్చు కాకపోవడం అంటే ప్రణాళిక లోపమా, అధికారుల నిర్లక్ష్యమా, లేక పర్యవేక్షణ బలహీనతా అన్నది ప్రభుత్వం సమీక్షించాల్సిన అవసరం ఉంది.సంక్షేమ పథకాల విజయాన్ని కేవలం బడ్జెట్ ప్రకటనలతో కొలవలేం. చివరి లబ్ధిదారుడి వరకు సేవలు చేరాయా లేదా అన్నదే అసలు ప్రమాణం. నిధులు ఖర్చు కాకపోతే ప్రభుత్వ ఖాతాల్లో మిగిలిపోయే సంఖ్యలు మాత్రమే పెరుగుతాయి; కానీ గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణికి పోషకాహారం అందదు, హింసకు గురైన మహిళకు అవసరమైన సహాయం ఆలస్యమవుతుంది, ఆపదలో ఉన్న చిన్నారికి రక్షణ అందదు. అంటే నష్టపోయేది కేవలం బడ్జెట్ కాదు; మనుషుల జీవితాలే.ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం జిల్లాల పనితీరును క్రమం తప్పకుండా సమీక్షించాలి. ప్రతి పథకానికి జిల్లా వారీగా నెలవారీ పురోగతి నివేదికలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారులపై జవాబుదారీతనం నిర్ధారించాలి. అదే సమయంలో వంద శాతం నిధులను వినియోగించి మెరుగైన ఫలితాలు సాధించిన జిల్లాల విధానాలను ఇతర జిల్లాల్లోనూ అమలు చేయాలి. ఉత్తమ పద్ధతులను పంచుకోవడం, డిజిటల్ పర్యవేక్షణను బలోపేతం చేయడం, నిధుల విడుదల నుంచి వ్యయం వరకు పారదర్శక వ్యవస్థను ఏర్పాటు చేయడం అత్యవసరం.ప్రజాధనం పవిత్రమైన బాధ్యత. ఆ నిధులు ఖర్చు కావడం అంటే కేవలం లెక్కలు పూర్తికావడం కాదు; ఒక బాలిక పాఠశాలకు వెళ్లడం, ఒక చిన్నారి ప్రాణం రక్షించబడడం, ఒక గర్భిణి ఆరోగ్యంగా ఉండడం, ఒక బాధిత మహిళకు భరోసా లభించడం. అందుకే సంక్షేమ పథకాలలో ప్రతి రూపాయి సకాలంలో ఖర్చై లక్ష్య వర్గాలకు చేరేలా ప్రభుత్వం కఠినమైన పర్యవేక్షణ, పారదర్శకత, జవాబుదారీతనాన్ని అమలు చేయాలి. నిధులు కేటాయించడం పాలనకు తొలి మెట్టు మాత్రమే; అవి ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే నిజమైన మంచి పాలనకు అసలు ప్రమాణం. మహిళలు, చిన్నారుల సంక్షేమం విషయంలో నిర్లక్ష్యానికి ఏమాత్రం చోటు ఉండకూడదు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలంటే నిధుల కేటాయింపుతో పాటు వాటి సమర్థ వినియోగానికీ ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైంది.




## ఎందుకింత గందరగోళం..?

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ.. సర్ గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. ఆగస్ట్ 3 వరకు ఎన్యూమరేషన్ ఫారాలను స్వీకరించనున్నట్లు తెలిపింది. ఆగస్ట్ 10న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటన, ఆగస్ట్ 10 నుంచి సెప్టెంబర్ 9 వరకు అభ్యంతరాల స్వీకరణ చేపట్టనుంది. అభ్యంతరాలపై విచారణకు అక్టోబర్ 8 వరకు ఈసీఐ తుదిగడువు విధించింది. ఇప్పటికే ఏపీలో సర్ గడువును ఈనెల 24 వరకు పొడిగించింది ఈసీ.పాత షెడ్యూల్ ప్రకారం బీఎల్ఓలు ఈ నెల 24 వరకు ఇంటింటి సర్వే చేయాల్సి ఉండగా ప్రస్తుతం కొత్త షెడ్యూల్ ప్రకారం వచ్చే నెల 3 వరకు చేయనున్నారు. రాష్ట్ర సీఈవో ఈ నెల 15న పంపిన విజ్ఞప్తి మేరకు, అంతకుముందు మే 14న ఇచ్చిన పాత షెడ్యూల్‌ను సవరిస్తున్నట్లు ఈసీఐ స్పష్టం చేసింది. మార్పు చేసిన కొత్త షెడ్యూల్ వివరాలను సంబంధిత అధికారులందరికీ తక్షణమే చేరవేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ప్రజలకు తెలిసేలా అన్ని ప్రచార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని సూచించింది. అదేవిధంగా రాజకీయ పార్టీలకు సైతం సవరించిన తేదీల సమాచారాన్ని లిఖితపూర్వకంగా అందజేయాలని కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర సీఈవోను ఆదేశించింది.ప్రస్తుతం ఢిల్లీ, పంజాబ్, కర్ణాటకల్లో కొనసాగుతున్న సర్ ప్రక్రియ గడువును సైతం పొడిగిస్తున్నట్లు ఎన్నికల కమిషన్ తెలిపింది. దీని ప్రకారం ఢిల్లీలో ముసాయి ఓటరు జాబితాను వచ్చే నెల 5వ తేదీకి బదులుగా 17వ తేదీన ప్రచురించనుంది. ఇంటింటి సర్వే షెడ్యూల్‌ను ఈ నెల 29వ తేదీ నుంచి వచ్చే నెల 8వ తేదీకి పొడిగించింది. పంజాబ్‌లో ఇంటింటి సర్వే వచ్చే నెల 3వ తేదీ వరకు కొనసాగనుంది. ఇక్కడ ముసాయి జాబితాను వచ్చే నెల 13న ప్రచురించనుంది. అదేవిధంగా, కర్ణాటకలో వచ్చే నెల 8వ తేదీ వరకు సర్వే చేపడతారు. ముసాయిదా జాబితా వచ్చే నెల 17వ తేదీన వెలువడనుంది. ఏపీ, తెలంగాణ ప్రజలకు మామూలుగానే అనేక సమస్యలు ఉంటున్నాయి. వాటికి అదనంగా సర్ తోడైంది. ఇది ఓటుతో లింక్ అయ్యి ఉండటం, దీన్ని లైట్ తీసుకుంటే, ఓటు కోల్పోయే ప్రమాదం ఉండటంతో.. దీన్ని టచ్ చెయ్యక తప్పట్లేదు. భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ -2026 ప్రక్రియ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కీలక దశలో ఉంది. ఓటర్ల జాబితాను సరిచెయ్యడం, డూప్లికేట్లను తొలగించడం, అర్హులైనవారిని జారితాలో చేర్చడం ఈ ప్రక్రియ లక్ష్యం. బూత్ లెవల్ అధికారులు ఇంటింటికి వెళ్లి ప్రీ-ఫిల్డ్ ఎన్యూమరేషన్ ఫారాలు ఇచ్చి, వాటిని నింపాక, సేకరిస్తున్నారు. ఆన్‌లైన్‌లో కూడా సమర్పించే వీలు ఉంది.ఏపీలో సుమారు 4.16 కోట్ల ఓటర్లలో దాదాపు 39.81 లక్షల నుంచి 40.86 లక్షల ఫారాలు ఇంకా సేకరించలేకపోయారు. వీటిలో చాలా భాగం చనిపోయినవారు, వలస వెళ్లినవారు, చిరునామాలు లభించని వారికి సంబంధించినవి. తిరుపతి, పోలవరం, గుంటూరు, నెల్లూరు వంటి జిల్లాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. కాకపోతే 80 నుంచి 90 శాతం దాకా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ అక్కడ పూర్తైంది. ఇక తెలంగాణ విషయానికొస్తే.. ఇక్కడ 25 శాతం డిజిటలైజేషన్ కూడా పూర్తి కాలేదు. దీంతో ఇదే తరహాలో సర్ జరిగితే.. తర్వాత భారీగా ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం కనిపిస్తోంది.ఓటర్ల జాబితాను సమూలంగా ప్రక్షాళించటానికి ఉద్దేశించిన సర్ ప్రక్రియ జరుగుతున్న తీరుతెన్నులను చూస్తుంటే ప్రజల ప్రత్యక్ష అనుభవం చెబుతున్న పాఠాలు చాలా కఠోరంగా ఉంటున్నాయి. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ఇంకో రెండేళ్ల తర్వాతే జరుగుతాయి. బిహార్, బెంగాల్, తమిళనాడులో లాగా ఎన్నికల ముందు హడావుడిగా ఇక్కడ సర్ చేపట్టలేదు. అంతవరకూ కాస్త ఉపశమనమే. కానీ తెలంగాణలో ఇప్పుడు జరుగుతున్న దాన్ని, ఓటర్లలో నెలకొన్న అనేక సందేహాలను, వాళ్లు స్వయంగా సేకరించాల్సిన సమాచారాన్ని, వెలికితీయాల్సిన పత్రాలను దృష్టిలో పెట్టుకుంటే.. అధికార యంత్రాంగం నిర్లక్ష్యం అడుగడుగునా కనిపిస్తోంది. సర్ నిబంధనల ప్రకారం బూత్ లెవల్ ఆఫీసర్లు మూడుసార్లు ఓటర్ల ఇళ్లకు వెళ్లాలి. ఇది ప్రాథమిక నియమం. నగరాలు, పట్టణాల్లో అది అమలవుతున్న ప్రాంతాలను వేళ్లపై లెక్కపెట్టవచ్చు. ఒక్కసారి కూడా రాని ప్రాంతాలు వందల్లో ఉంటాయి. అయినా అంతా సజావుగా సాగుతోందని ఎన్నికల కమిషన్ గొప్పగా చెబుతోంది. ప్రజలందరి చేతుల్లో మొబైల్ ఫోన్లు ఉండి, సామాజిక మాధ్యమం నిఘా విస్తృతంగా ఉన్న నేపథ్యంలో బీఎల్ఓలు ఒక్కచోటే కూర్చొని ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్న దృశ్యాలు వందలు కనపడుతున్నాయి. ఇది అంతవరకే అయిపోలేదు. పూర్తిచేసిన ఫారాలను కూడా ఓటర్లే మళ్లీ బీఎల్ఓల వద్దకు వెళ్లి సమర్పించుకునే పరిస్థితే చాలా చోట్ల ఉంది. సర్ ప్రక్రియలో ప్రాథమిక అడుగే సరిగా పడలేదని దీన్నిబట్టి తేలికగానే అర్థం అవుతుంది. అయినా మన యంత్రాంగం సమర్థత బ్రహ్మాండంగా ఉందని మనం సరిపెట్టుకోవాలి. అంతా సజావుగా నడుస్తోందని మనకుమనమే సర్దిచెప్పుకోవాలి. నియమాలు ఘనంగా, అమలు హీనంగా ఉండటం అనేది మన ప్రభుత్వాల సహజ లక్షణంగా భావిస్తేనే అలా చేయగలం. ముఖ్యంగా అట్టడుగు, మధ్యతరగతి వర్గాలకు వచ్చేసరికి ఎన్నో చట్టాలు, నియమాల పరిస్థితి ఇదే తీరులో ఉంటోంది. అందుకే ఏ ప్రక్షాళనలోనైనా నష్టపోయేది ఈ వర్గాలే.కొత్తగా ఒక వ్యక్తిని ఓటరుగా నమోదుచేయటానికి ఎన్నో పత్రాలు చూడాలి. స్వయంగా బీఎల్ఓ ఆ వ్యక్తి నివసించే ఇంటిని సందర్శించాలి. ఆషామాషీగా ఒక వ్యక్తిని ఓటరుగా నమోదు చేయకూడదనేది నియమం. ఆ నియమాన్ని కచ్చితంగా పాటించే.. ఓటర్లుగా నమోదుచేశామని చెప్పే ఎలక్షన్ కమిషన్ తాను జారీచేసిన ఓటరు గుర్తింపు కార్డులనే సర్‌లో ప్రామాణికంగా తీసుకోలేమని సుప్రీంకోర్టుకు స్వయంగా చెప్పింది. అలాగే ఆధార్ కార్డు అందుకు ఉపయోగపడదని తేల్చి చెప్పింది. సుప్రీంకోర్టు చివరకు ఎలక్షన్ కమిషన్ వాదననే పరిగణనలోకి తీసుకుంది. ఆధార్ కార్డుని విదేశీవ్యక్తులకు కూడా జారీచేస్తారని, అందుకే అది ప్రామాణికం కాదనే వాదన ఎంత లోపభూయిష్ఠమో మన ఇంగితజ్ఞానం చెబుతూనే ఉంటుంది. ఎంతమంది విదేశీయులకు అధికారికంగా ఆధార్ కార్డులు జారీ అయివుంటాయో లెక్కలుతీస్తే వారి సంఖ్య చాలా పరిమితంగానే ఉంటుంది. వాళ్లు అయినా కొన్ని పత్రాలు సమర్పించకుండా కార్డులు పొందలేరు. అతి స్వల్పసంఖ్యలో విదేశీయులు ఆధార్ పొందుతుంటే మొత్తం ఆధార్ కార్డుల ప్రామాణికతనే శంకించటం సామాన్యుల తర్కానికి అందదు. పర్యాటకులుగానో, విద్యార్థులుగానో, ఉద్యోగులుగానో, పరిశోధకులుగానో వచ్చిన విదేశీ వ్యక్తులకు ఆధార్ ఇవ్వాలన్న నిబంధనను అధికారికంగానే పెట్టుకుని ఈ వాదనను చేయటం విడ్డూరంగానూ, వైపరీత్యంగానూ భావించాలి. ఇక ఇతర దేశాల సరిహద్దులను దాటి దేశంలోకి అక్రమంగా ప్రవేశించినవాళ్లు ఆధార్ కార్డులు పొందటం ఎక్కువగానే ఉందని అనుకుందాం. మరి అందుకు కారణం ఎవరు? అని ప్రశ్నించుకుంటే వేళ్లన్నీ అధికారయంత్రాంగం వైపే చూపుతాయి.సందేహాస్పద ఓటర్లందరినీ మనం అక్రమ వలసదారులుగా భావించలేం. బీఎల్ఓలకు సరైన పత్రాలను అందించలేని వాళ్లనూ ఆ జాబితాలో చేర్చుతారు. ఇక్కడే సర్ ఉద్దేశం నీరుగారుతోంది. ఉదాహరణకు తెలంగాణలో 2002లో చేపట్టిన సర్ తర్వాత ఏడుసార్లు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఓటువేసిన వారందరూ కూడా ఇప్పుడు మళ్లీ తమని తామే నిఖార్సైన ఓటర్లుగా నిరూపించుకోవాలి. ఇంటర్‌నెట్‌ని ఉపయోగించగలిగినవాళ్లు కూడా 2002 నాటి సర్ జాబితాలో తమ పేర్లు వెతుక్కోటానికి కిందామీదా పడుతున్నారు. గంటలపాటు దానికోసం ప్రయత్నించి విఫలమై చివరకు 2002నాటి సర్‌లో తమపేరు లేదనే వెసులుబాటును ఉపయోగించుకుని ఎన్యూమరేషన్ ఫారాన్ని ఆన్‌లైన్‌లో పూర్తిచేస్తున్నారు. దీనికి ఫోన్‌నంబరు, ఆధార్ కార్డు వివరాలను సమర్పించి వాటి ఆధారంగా వచ్చే ఓటీపీలతో ప్రక్రియను పూర్తిచేస్తున్నారు. 2002 నాటి సర్ జాబితాతో సంబంధం లేకుండానే ఓటర్లుగా కొనసాగే అవకాశం ఉంటే.. అసలు దాంతో మొత్తం ప్రక్రియను ఎందుకు ముడిపెట్టాల్సి వచ్చిందనే ప్రశ్నకు ఈసీ ఇప్పటికైనా సమాధానం చెప్పగలదా అంటే సందేహమే. 2002 నాటి సర్ ఎలా జరిగిందో చూస్తే.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పుడు సర్‌కు సంబంధించి ప్రత్యేక హడావుడి కనపడలేదు. మామూలు ఓటర్ల జాబితా సవరణ లాగే అది జరిగిపోయింది. బహుశా అప్పుడు ఎన్నికలు లేకపోవటం కూడా అందుకు కారణమై ఉంటుంది. దీనికి భిన్నంగా ఇటీవల బిహార్, బెంగాల్, తమిళనాడుల్లో తగిన సమయం ఓటర్లకు ఇవ్వకుండా హడావుడిగా సర్ చేపట్టటంతోనే తీవ్రస్థాయిలో వివాదాలు చెలరేగాయి. రాజకీయ పార్టీలన్నీ ఎన్నికల వ్యూహాలు, ఎత్తుగడలు, ప్రచారాల్లో మునిగిపోయిన సందర్భంలో సర్ చేపట్టటం అనుచితంగానే కనపడుతుంది. ఆ అనుచిత చర్యలే ఎన్నికల కమిషన్ నిష్పాక్షికతను ప్రశ్నించేలా ఆస్కారం కల్పించాయి. అధికార వ్యవస్థలన్నీ రాజకీయ ప్రయోజనాల కోసం కావాల్సిన రీతిలో ఒరిగిపోతున్న నేపథ్యంలో ఎన్నికల ముందు చేపట్టిన సర్‌పై అనుమానాలు కలగకుండా ఉండవు. ఇప్పుడే బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లలేని పరిస్థితి ఉంటే 2002లో సర్ అంతా సక్రమమని భావించి దాన్ని ప్రామాణికంగా తీసుకోవటం ఏ మాత్రం సహేతుకంగా అనిపించదు. అప్పటికి మొబైల్ ఫోన్లు లేవు. ల్యాండ్‌లైను ఫోను ఉన్న వాళ్లూ తక్కువే. సోషల్ మీడియా లేదు. ఒక్కమాటలో చెప్పుకోవాలంటే ఇప్పటి స్థాయిలో విస్తృత ప్రజానిఘా లేని ఆనాటి పరిస్థితిలో 2002 నాటి సర్‌కు చాలా పరిమితులు ఉంటాయి. పేర్లలో, ఇంటిపేర్లలో, వయస్సుల నమోదులో ఎన్నో తప్పులు ఆనాటి జాబితాలో కనపడతాయి. వీటన్నిటినీ సరిదిద్దుకోవాల్సిన బాధ్యతను ఇప్పుడు ఓటర్లపైనే పెట్టారు. అర్హులైన వారిని ఓటర్లుగా నమోదుచేయటం రాజ్యాంగం ప్రకారం ఎన్నికల కమిషన్ విధి. అలా నమోదుచేసిన వాళ్లను కొన్నేళ్ల తర్వాత .. మిమ్మల్ని మీరు ఓటర్లుగా నిరూపించుకోండి అని చివరికి అదే కమిషన్ ఆదేశించటం ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని పలుచన చేయటమేనని ఇప్పటికే ఎన్నో విమర్శలు వచ్చాయి. వస్తున్నాయి.గ్రామాల్లో చనిపోయిన వారి సమాచారం స్థానిక పంచాయతీ సిబ్బంది దగ్గర ఉంటుంది. కనీసం దాని ఆధారంగా ప్రతిఏటా జరిగే ఓటర్ల సవరణ ప్రక్రియలో వాళ్ల పేర్లను తేలికగానే తొలగించవచ్చు. అది కూడా చేయలేని అసమర్థతను ఎన్నికల కమిషన్ యంత్రాంగం ప్రదర్శించింది. ఇటీవల సర్ చేపట్టిన రాష్ట్రాల్లో ఒక్క బెంగాల్ మినహా మిగతాచోట్ల ఎంతమంది చనిపోయిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారో స్పష్టంగా పేర్కొనలేదు. బెంగాల్‌లో 91 లక్షల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. అందులో మరణించిన వారి పేర్లు 58.08 లక్షలు ఉన్నాయి. ఏటా ఓటర్ల జాబితా సవరణ సక్రమంగా జరిగితే ఒక్కసారిగా ఇన్నిపేర్లను తొలగించాల్సిన అవసరం ఉండదు. అన్ని రాష్ట్రాల్లో సర్ పూర్తయితే ఎంతమంది ఓటర్ల జాబితా నుంచి తొలగిపోతారన్నది ఇంకా స్పష్టం కాలేదు. మొత్తంగా ఈ సంఖ్య 10 కోట్లు దాటుతుందనే అంచనాలు ఉన్నాయి. సర్ పూర్తయిన చోట ఇప్పటివరకూ 5 కోట్లకు పైబడి పేర్లను జాబితాల నుంచి తొలగించారు. తుది లెక్కలు తేలేసరికి దాదాపుగా 10శాతానికి పైగా ఓటర్లు జాబితా నుంచి తొలగిపోయే అవకాశం ఉంది. ఏ ప్రజాస్వామ్య దేశంలోనూ ఇంతస్థాయిలో ఇలా తొలగింపులు జరగలేదన్న విమర్శను తేలికగా కొట్టేయలేం. చనిపోయిన వాళ్లను, ఒకటికి మించి పలుచోట్ల ఓటర్లుగా ఉన్న వాళ్లను జాబితా నుంచి తొలగించటానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకునే వెసులుబాట్లను కనుక్కోకుండా మీరు పౌరులో కాదో నిరూపించుకోండని అందరినీ కోరటమే హాస్యాస్పదం.ఇక్కడ మరో ట్విస్ట్ ఏంటంటే.. సర్‌తో ఓట్లు తొలగిన తర్వాతా మళ్లీ జాబితాలో కొత్త ఓటరుగా నమోదుకావటానికి అవకాశం ఉంటుందని అధికారులు ఒకటికి పదిసార్లు చెప్పారు. నిబంధనలు అందుకు అనుకూలంగా ఉన్నాయనీ స్పష్టంచేశారు. కానీ, రోజులు గడవకుండానే మెలికపెట్టారు. దీనినీ సర్‌తో ముడిపెట్టారు. మొత్తంగా సర్‌తో ఎవరు అసలైన ఓటరో తేల్చటం కుదురుతుందా.. లేదా అనేది పెద్ద క్వశ్చన్‌మార్క్‌గా మిగిలిపోతోంది. మొత్తం మీద దేశంలో సర్ ప్రక్రియ మొదలైన దగ్గర్నుంచో దశల వారీగా ఈసీ నుంచి వస్తున్న ప్రకటనలు.. వాటికి ఎక్కడికక్కడ అధికారులు ఇస్తున్న వివరణలతో.. ఓటర్లు మరింత గందరగోళంలో కూరుకుపోతున్నారనడంలో సందేహం లేదు.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

# ల్యాండ్ పూలింగ్ ప్రాజెక్టుపై ఫోకస్...



- 16 కిలోమీటర్ల పరిధిలో భూముల గుర్తింపు ప్రారంభం
- అసైన్డ్, ప్రభుత్వ, పట్టా భూములపై సర్వే
- బోడుప్పల్-గౌరెల్లి ప్రాంతాల్లో ల్యాండ్ పూలింగ్ కసరత్తు
- బ్యాంకు రుణాల చెల్లింపునకు భూముల అభివృద్ధి వ్యూహం
- మూసీ కారిడార్‌లో విలువైన భూముల వినియోగానికి ప్రణాళిక
- ఎంఆర్డీసీఎల్ 734 ఎకరాల్లోనూ ల్యాండ్ పూలింగ్
- ప్రభుత్వ, సంస్థల భూములపైనా హెచ్ఎండీఏ దృష్టి

రాష్ట్ర ప్రభుత్వం మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టుతో పాటు ల్యాండ్ పూలింగ్ ప్రాజెక్టులను వేగవంతం చేయాలని నిర్ణయించింది. 55 కిలోమీటర్ల మూసీ ప్రాజెక్టులో భాగంగా నాగోల్-గౌరెల్లి 16 కిలోమీటర్ల మార్గంలో ల్యాండ్ పూలింగ్ చేపట్టేందుకు ప్రాధాన్యం ఇస్తోంది. ఇందుకోసం ప్రత్యేక చట్టానికి ముసాయిదాను హెచ్ఎండీఏ ప్రభుత్వానికి సమర్పించింది. ప్రాజెక్టు కోసం అవసరమైన నిధులను బ్యాంకు రుణాల ద్వారా సమీకరిస్తున్న ప్రభుత్వం, ల్యాండ్ పూలింగ్ ద్వారా భూముల విలువను పెంచి పెట్టుబడులను తిరిగి రాబట్టే వ్యూహాన్ని అమలు చేయాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో నాగోల్-గౌరెల్లి మార్గంలో ఉన్న అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములు, పట్టా భూములను హెచ్ఎండీఏ అధికారులు గుర్తిస్తున్నారు. బోడుప్పల్, ఫీర్జాదిగూడ, ప్రతాప్ సింగారం, గౌరెల్లి ప్రాంతాల్లో ల్యాండ్ పూలింగ్‌కు అనువైన భూములను ఎంపిక చేయడంతో పాటు, ఎంఆర్డీసీఎల్‌కు కేటాయించిన 734 ఎకరాలు, అలాగే గండిపేట, హిమాయత్ సాగర్, కిస్మత్‌పూర్, రాజేంద్రనగర్, శంషాబాద్ పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ, సంస్థల భూముల్లో కూడా ల్యాండ్ పూలింగ్ ప్రాజెక్టులు చేపట్టేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.


**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టుతోపాటు ల్యాండ్ పూలింగ్ ప్రాజెక్టులపై ఫోకస్ పెట్టింది. 55 కిలోమీటర్ల మూసీ పునరుజ్జీవనం ప్రా-జెక్టులో నాగోల్ నుంచి గౌరెల్లి మార్గంలో అత్యధిక భూములు ఉన్నట్టు ప్రభుత్వం గుర్తించినట్టు తెలిసింది. దీంతోపాటు ఇతర ప్రాంతాల్లో సైతం భూములను గుర్తించి ల్యాండ్ పూలింగ్ ప్రాజెక్టులను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ల్యాండ్ పూలింగ్ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా చట్టాన్ని రూపొందించింది. దీనికి సంబంధించిన ముసాయిదాను ఇప్పటికే ప్రభుత్వానికి హెచ్ఎండీఏ అందజేసింది.

**16 కిలోమీటర్ల మార్గంలో..**

భూసేకరణ తక్కువగా ప్రాంతాలను ఎంచుకుని ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే గండిపేట్‌పేట్, హిమాయత్ సాగర్ నుంచి లంగర్ హౌస్ (గాంధీ సరోవర్ ప్రాజెక్టు) వరకు మొదటి దశలో 21 కిలోమీటర్ల మార్గంలో ప్రాజెక్టు పనులు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం రెండో దశలో నాగోల్ నుంచి గౌరెల్లి వరకు చేపట్టాలని 16 కిలోమీటర్లకు వంద రోజుల్లో డీపీఆర్ రూపొందించాలని నిర్ణయించింది. 55 కిలోమీటర్ల ప్రాజెక్టులో 37 కిలోమీటర్ల రెండు దశలోనే పూర్తి చేయాల్సి ఉంది. అయితే నాగోల్ నుంచి గౌరెల్లి మార్గంలో ల్యాండ్ పూలింగ్ ప్రాజెక్టులను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ బాధ్యతలను హెచ్ఎండీఏకు అప్పగించింది. మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టు కోసం బ్యాంకు రుణాల ద్వారా నిధులను సమీకరిస్తున్న ప్రభుత్వం తిరిగి రాబట్టుకోవడానికి ప్రణాళికలను రూపొందించింది. అందులో భాగంగానే మూసీ మార్గంలోనే ల్యాండ్ పూలింగ్ ప్రాజెక్టులను చేపట్టి నిధులు సమీకరించాలని అనుకుంటోంది.

**అసైన్డ్ భూముల గుర్తింపు:**

నాగోల్-గౌరెల్లి వరకు చేపట్టే మూసీపునరుజ్జీవనం ప్రాజెక్టుతో పాటు ఈ 16 కిలోమీటర్ల మార్గంలో ఎక్కడెక్కడ అసైన్డ్ భూములు ఉన్నాయి? ఏమైనా ప్రభుత్వ భూములు ఉన్నాయా? రైతులకు సంబంధించిన పట్టా భూములు ఎన్ని ఎకరాలు ఉన్నాయి? గుర్తించేందుకు హెచ్ఎండీఏ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ముఖ్యంగా బోడుప్పల్, ఫీర్జాదిగూడ, ప్రతాప్ సింగారం, గౌరెల్లి ప్రాంతాల్లో అసైన్డ్ భూములు ఎక్కువగా ఉన్నాయని అధికారుల అంచనా. ఆ భూముల్లో ల్యాండ్ పూలింగ్ చేపట్టాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. వీటితోపాటు ఎంఆర్డీసీఎల్‌కు కేటాయించిన 734 ఎకరాల భూముల్లో ల్యాండ్ పూలింగ్ ప్రాజెక్టు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. ఈసా నది సమీపంలోని గండిపేట మండలం హిమాయత్ సాగర్, కిస్మత్‌పూర్, రాజేంద్రనగర్ మండలానికి చెందిన ప్రేమావతిపేట్, బుద్వేల్ ప్రాంతాల్లో ఉన్న టీఈఈఆర్ఎల్, ఐఐపీహెచ్, ఇతర సంస్థలకు కేటాయించిన భూములతోపాటు శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ పరిధిలో హెచ్ఎండీఏ లేఅవుట్ కోసం కేటాయించిన భూమిని మూసీకి బదలాయించారు. వీటిల్లో ల్యాండ్ పూలింగ్ ప్రాజెక్టులు చేపట్టనున్నారు.



## నగరాల్లో సరికొత్త వెలుగులు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** పట్టణ ప్రాంతాల్లో రాత్రి వేళల్లో భద్రతను పెంపొందించడం, ఇంధన పొదుపును సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం సరికొత్త వీధి దీపాల ఆధునీకీకరణ ప్రా-జెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ కార్పొరేషన్ల పరిధిలో ఉన్న పాత వీధి దీపాల స్థానంలో అత్యాధునిక, అధిక సామర్థ్యం కలిగిన ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేయనున్నారు. 10 ఏళ్ల సమగ్ర నిర్వహణ కాలపరిమితితో కూడిన ఈ మెగా ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 1,341.60 కోట్లుగా నిర్ణయించారు.

**7.61 లక్షల ఎల్ఈడీ లైట్లు**

రాబోయే 2 ఏళ్ల వ్యవధిలో మొత్తం 7.61 లక్షల పాత వీధి దీపాల స్థానంలో కొత్త ఎల్ఈడీ ఫిక్చర్లను అమర్చాల్సి ఉంటుందని టెండర్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న 34,512 సీసీఎంఎస్ (సీసీఎంఎస్) ప్యానెళ్లను, స్విచ్చింగ్ పాయింట్లను పూర్తిగా తొలగించి, వాటి స్థానంలో కొత్త ప్యానెళ్లను కేవలం 6 నెలల్లోపే ఏర్పాటు చేయాల్సి ఉంది. వీధి దీపాల వ్యవస్థను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి, నియంత్రించడం తో పాటు విడివిడిగా రియల్ టైమ్ మానిటరింగ్ చేయడానికి జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ కార్పొరేషన్లకు 'సెంట్రలైజ్డ్ డాష్‌బోర్డ్'లను ఏర్పాటు చేయనున్నారు. గతంలో ప్రతి 4,000 వీధి దీపాలకు ఒక మెయింటె-నెన్స్ బ్యాచ్ ఉండగా, ఇకపై ఆ నిబంధనను సవరించి ప్రతి 2,500 దీపాలకు ఒక బ్యాచ్‌ను కేటాయించనున్నారు. లైట్ల మార్పిడి దశలో ప్రతి సర్కిల్‌కు ఒకటి చొప్పున మొత్తం 60 హైడ్రాలిక్ క్రేన్లను, ఆ తర్వాత నిర్వహణ కాలంలో కనీసం 30 క్రేన్లను కాంట్రాక్టర్ అందుబాటులో ఉంచాలి. సీసీఎంఎస్ ప్యానెళ్ల నిర్వహణ కోసం ప్రతి సర్కిల్‌కు ఇద్దరు టెక్నీషియన్లతో కూడిన ప్రత్యేక బృందాన్ని నియమించాలని నిర్ణయించారు. నిరంతరాయంగా కనీసం 98 శాతం వీధి దీపాలు వెలుగుతూనే ఉండాలి.

**టెండర్ అర్హతలు..**

ఈ ప్రాజెక్టు లో పాల్గొనే లీడ్ బిడ్డర్ (ప్రధాన సంస్థ) కనీసం రూ.400 కోట్ల వార్షిక టర్నోవర్ కలిగి ఉండాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. ఎల్ఈడీ స్ట్రీట్ లైటింగ్, సీసీఎంఎస్ ప్రాజెక్టులలో అనుభవం ఉన్న కంపెనీలు/ఓఈఎంలు ఈ టెండర్లకు అర్హులు. నిబంధనలకు లోబడి జాయింట్ వెంచర్లు (జేవీ)/కన్సార్టియంగా ఏర్పడి బిడ్లు దాఖలు చేయవచ్చు.

## ఉత్తర-తూర్పు హైదరాబాద్ కీలక

**మేడ్చల్,ఫ్లాష్ ఇండియా :** ఇప్పటి వరకు పశ్చిమ హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌కే అధిక ప్రాధాన్యం ఉన్నప్పటికీ.. ప్రస్తుతం ఉత్తర, తూర్పు హైదరాబాద్ ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. జాతీయ రహదారులు, ఔటర్ రింగ్ రోడ్ , మెట్రో విస్తరణ, పారిశ్రామిక-ఐటీ ఉపాధి కేంద్రాల పెరుగుదలతో ఈ రెండు కారిడార్లలో గృహ, వాణిజ్య ప్రాజెక్టులు పెరుగుతున్నాయి. మార్కెట్ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. మధ్య తరగతి కొనుగోలుదారులు, దీర్ఘకాలిక పెట్టుబడిదారుల దృష్టి ఇప్పుడు ఈ ప్రాంతాలపై కేంద్రీకృతమవుతోంది.

**ఉత్తర హైదరాబాద్‌లో ప్రాజెక్టులు**

కొంపల్లి, బాచుపల్లి, నిజాంపేట్, సుచిత్ర, ప్రగతి నగర్, మేడ్చల్, గుండ్ల పోచంపల్లి ప్రాంతాల్లో భారీ గేటెడ్ కమ్యూనిటీలు, హై-రైజ్ అపార్ట్‌మెంట్లు, విల్లా ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. తక్కువ ధరల్లో భూమి లభ్యత, ఓఆర్ఆర్ జాతీయ రహదారుల అనుసంధానం, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, వాణిజ్య కేంద్రాల పెరుగుదల ఈ ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్‌కు ఊతమిస్తోంది. 2026 తొలి త్రైమాసికంలో హైదరాబాద్‌లో ప్రారంభమైన కొత్త గృహ ప్రాజెక్టుల్లో ఉత్తర మండలాల వాటా గణనీయంగా నమోదైంది.

**పెట్టుబడిదారుల దృష్టి**

ఉప్పల్, పోచారం, ఘట్‌కేసర్, యాదాద్రి కారిడార్ వైపు రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు క్రమంగా విస్తరిస్తున్నాయి. ఉప్పల్ మెట్రో కనెక్టివిటీ, పోచారంలోని ఐటీ, విద్యాసంస్థలు, వరంగల్ జాతీయ రహదారి అనుసంధానం, ప్రతిపాదిత మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు ఈ ప్రాంతాల భవిష్యత్ వృద్ధికి దోహదం చేస-్తున్నాయి. ప్రస్తుతం పశ్చిమ ప్రాంతాలతో పోలిస్తే ధరలు అందుబాటులో ఉండటంతో దీర్ఘకాలిక పెట్టుబడులకు అనుకూలంగా భావిస్తున్నారు.

**మధ్యతరగతి కొనుగోలుదారులు**

పశ్చిమ హైదరాబాద్‌లో ధరలు భారీగా పెరగడంతో మధ్యతరగతి కొనుగోలుదారులు ఉత్తర, తూర్పు ప్రాంతాల వైపు మొగ్గు చూపుతున్నారు. రూ. 50 లక్షల నుంచి రూ. 1.2 కోట్ల మధ్య బడ్జెట్ గృహాలకు ఈ ప్రాంతాల్లో విస్తృత అవకాశాలు ఉండటంతో పాటు ప్లాట్లు, విల్లాలు, అపార్ట్‌మెంట్ ప్రాజెక్టులు సవ-ంతుల్యంగా అందుబాటులోకి వస్తున్నాయి.

**భవిష్యత్ అవకాశాలు**

హైదరాబాద్ అభివృద్ధి ఇక ఒక్క పశ్చిమ కారిడార్‌కే పరిమితం కాకుండా బహుళ దిశల్లో విస్తరిస్తోందని రియల్ ఎస్టేట్ రంగ నిపుణులు పేర్కొంటున్నారు. ఉత్తర, తూర్పు ప్రాంతాల్లో రహదారులు, పారిశ్రామిక పా-ర్కులు, ఐటీ విస్తరణ, ప్రజా రవాణా సదు-పాయాలు మరింత బలోపేతమైతే రానున్న ఐదు నుంచి పది సంవత్సరాల్లో ఈ ప్రాంతాలు నగరంలోని కీలక రియల్ ఎస్టేట్ వృద్ధి కేంద్రాలుగా అవతరించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## చరిత్ర సృష్టించిన విక్రమ్-1..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** భారత ప్రైవేట్ అంతరిక్ష రంగంలో శనివారం ఒక సరికొత్త చరిత్ర లిఖించబడింది. ప్రైవేట్ రంగంలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసిన దేశపు మొట్టమొదటి ఆర్బిటల్-క్లాస్ రాకెట్ 'విక్రమ్-1' శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. ఈ చారిత్రాత్మక ప్రయోగానికి 'మిషన్ ఆగమన్' అని పేరు పెట్టారు. ఈ విజయంతో వాణిజ్యపరంగా సొంతంగా రాకెట్లను తయారు చేసి కక్ష్యలోకి పంపగల సామర్థ్యం ఉన్న ప్రపంచంలోని కొన్ని ఎంపిక చేసిన దేశాల సరసన భారతదేశం నిలిచింది. నిప్పులు చిమ్ముతూ విక్రమ్-1 రాకెట్ ఆకాశంలోకి దూసుకెళ్తున్న దృశ్యం, గత కొన్నేళ్లుగా మన ఇంజనీర్ల పడ్డ కష్టానికి, వారి నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచింది. ప్రయోగానికి కొన్ని నిమిషాల ముందు చిన్న అంతర్గత సాంకేతిక కారణం వల్ల కొంత సమయం ఆలస్యమైనప్పటికీ, ఆ తర్వాత రాకెట్‌లోని అన్ని దశలు అనుకున్నట్లుగా, అత్యంత ఖచ్చితత్వంతో పనిచేశాయి. సుమారు ఏడు అంతస్తుల ఎత్తు ఉండే ఈ విక్రమ్-1 రాకెట్‌ను పూర్తిగా తేలికపాటి కార్బన్ కంపోజిట్ మెటీరియల్‌తో తయారు చేశారు. ఇది భూమికి దగ్గరగా ఉండే దిగువ కక్ష్యలోకి దాదాపు 350 కిలోల బరువున్న ఉపగ్రహాలను మోసుకెళ్లగలదు. ఈ రాకెట్ ఇంజన్‌లను సరికొత్త 3డి-ప్రింటింగ్ టెక్నాలజీతో, పూర్తి స్వదేశీ సాంకేతికతతో రూపొందించడం విశేషం. ఈ తొలి ప్రయోగంలో భాగంగా గృహా స్పేస్ , కాస్మోసెర్ప్ , డి-క్యూబ్ట్ వంటి సంస్థలకు చెందిన సాంకేతిక ప్రదర్శన ఉపగ్రహాలతో పాటు, స్కైరూట్ సంస్థకు చెందిన 'స్కోప్' అనే ఎక్స్‌పెరిమెంట్‌ను కూడా అంతరిక్షంలోకి పంపారు. సాంకేతిక పరికరాలతో పాటు ఎంతో ప్రత్యేకమైన భావోద్వేగ వస్తువులను కూడా ఈ రాకెట్ ద్వారా నింగిలోకి పంపించారు. వాటిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వహస్తాలతో రాసిన వందేమాతరం పోస్ట్‌కార్డ్‌తో పాటు, ఇస్రో ప్రస్తుత, మాజీ ఛైర్మన్లు, భారతీయ వ్యోమగాములు, ఇన్వెస్టర్లు పంపిన రాతపూర్వక సందేశాలు ఉన్నాయి. ఈ ప్రయోగం ద్వారా లభించే కీలకమైన ఇంజనీరింగ్ డేటా ఆధారంగా స్కైరూట్ సంస్థ భవిష్యత్తులో మరిన్ని వాణిజ్య ప్రయోగాలను మరింత వేగంగా చేయగలుగుతుంది. మన దేశ అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలకు ఈ విజయం ఒక పెద్ద మైలురాయిగా నిలిచింది. ఇస్రోకు చెందిన మాజీ శాస్త్రవేత్తలు పవన్ కుమార్ చందన, నాగ భరత్ డాకా కలిసి 2018లో ఈ 'స్కైరూట్ ఏరోస్పేస్' సంస్థను స్థాపించారు. చిన్న ఉపగ్రహాల మార్కెట్‌లో తక్కువ ఖర్చుతో, నమ్మకమైన సేవలను అందించాలనే లక్ష్యంతో వారు ప్రయాణాన్ని ప్రారంభించారు. అంతకుముందు 2022లో వీరు ప్రయోగించిన 'విక్రమ్-ఎస్' దేశంలోనే మొట్టమొదటి ప్రైవేట్ సబ్-ఆర్బిటల్ రాకెట్‌గా రికార్డు సృష్టించగా, ఇప్పుడు 'విక్రమ్-1'తో ప్రైవేట్ ఆర్బిటల్ ప్రయోగాన్ని కూడా విజయవంతం చేసి భారత కీర్తిపతాకాన్ని విశ్వవీధిలో ఎగుర వేశారు.

**స్కైరూట్ 'విక్రమ్-1' విజయం తెలంగాణకు గర్వకారణం: సీఎం రేవంత్ రెడ్డి**

పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన ఆర్బిటాల్-క్లాస్ ప్రయోగ వాహనం 'విక్రమ్-1' ను విజయవంతంగా పరీక్షించింది. దీంతో హైదరాబాద్ స్పేస్-టెక్ సంస్థ 'స్కైరూట్ ఏరోస్పేస్'కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. 'మిషన్ ఆగమన్'లో భాగంగా నిర్వహించిన ఈ టెస్ట్ ఫ్లైట్-1 విజయం.. భారత అంతరిక్ష రంగ చరిత్రలో ఒక చారిత్రాత్మక ఘట్టమని, ఇది తెలంగాణ రాష్ట్రానికి ఎంతో గర్వకారణమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో శంషాబాద్‌లోని జీఎంఆర్ ఏరోస్పేస్ పా-ర్క్‌లో ఉన్న స్కైరూట్ 'మ్యాక్స్-క్యూ క్యాంపస్'ను సందర్శించినప్పుడు, తానే స్వయంగా విక్రమ్-1 ఫ్లైట్ హార్డ్‌వేర్‌ను శ్రీహరికోట తరలించే కార్యక్రమాన్ని ప్రారంభించానని సీఎం ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఈ స్టార్టప్ సాధించిన ఘన విజయం దేశం అంతరిక్ష సాంకేతిక రంగంలో సాధిస్తున్న పురోగతికి నిదర్శనమని, భారత యువ శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పిందని ముఖ్యమంత్రి ప్రశంసించారు. ఈ విజయంతో ఏరోస్పేస్ ఆవిష్కరణలు, అధునాతన తయారీ రంగానికి తెలంగాణ అనువైన గమ్యస్థానంగా మారిందని, రాష్ట్రాన్ని ప్రపంచస్థాయి ఏరోస్పేస్, స్పేస్ టెక్నాలజీ కేంద్రంగా తీర్చిదిద్దే దిశలో ఇదొక కీలక మైలురాయి అని చెప్పారు. స్కైరూట్ వంటి సంస్థల విజయాలు రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడం తో పాటు యువతలో శాస్త్ర, సాంకేతిక రంగాలపై ఆసక్తిని పెంపొందించి, భావితర ఆవిష్క-ర్తలకు స్ఫూర్తినిస్తాయని సీఎం రేవంత్ రెడ్డి

# ఆరేళ్ల క్రితం ప్రేమ పెళ్లి..

## డ్రైవర్‌తో ఎఫైర్.. భర్తను పాముతో కరిపించి చంపేసిన భార్య

**మీరట్ :** సమాజంలో రోజు రోజుకు మానవ విలువలు మంట కలుస్తున్నాయి. బతికున్నంత కాలం ఒకరికొకరు తోడునీడగా ఉండాల్సిన భార్యభర్తలు పరాయి బంధాల మోజులో పడి దారుణాలకు తెగబడుతున్నారు. తాజాగా స్కూల్ బస్సు డ్రైవర్‌తో ఎఫైర్ పెట్టుకున్న ఓ స్కూల్ నిర్వాహకుడి భార్య తన భర్తను పథకం ప్రకారం హత్య చేయించడం కలకలం రేపింది. ఆపై తన భర్త పాముకాటుతో మరణించినట్లు అందరిని నమ్మించేందుకు నాటకమమాడి చివరకు పోలీసులకు అడ్డంగా దొరికిపోయింది. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ జిల్లా హస్తినాపురంలో చోటు చేసుకున్న ఈ దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

**ప్రేమ వివాహం.. ఆపై ఎఫైర్:**

పోలీసుల కథనం ప్రకారం భందోరా గ్రామానికి చెందిన అతుల్ పన్వార్ (35), దామిని అనే మహిళను 2019లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరు హస్తినాపూ-ర్‌లో 'కృష్ణ కిడ్స్ పబ్లిక్ స్కూల్' నడుపుతున్నారు. ఈ క్రమంలో దామినికి అదే స్కూల్ డ్రైవర్ తుషార్‌తో అక్రమ సంబంధం ఏర్పడింది. భర్తను అడ్డు తప్పిస్తే అతడి పేరు మీద ఉన్న ఇన్సూరెన్స్ డబ్బు రూ. 20 లక్షలు వస్తాయని ఆపై తామిద్దరం పెళ్లి చేసుకోవచ్చని దామిని ఆమె ప్రియుడు తుషార్ కలిసి పన్వార్ హత్యకు ప్లాన్ చేశారు.


**నిద్రమాత్రలు ఇచ్చి.. బెడ్‌పై పామును వదిలి:**

పథకం ప్రకారం గత గురువారం రాత్రి దామిని తన భర్త అతుల్‌కు పాలలో నిద్రమాత్రలు కలిపి ఇచ్చింది. అతను గాఢ నిద్రలోకి జారుకోగానే దామిని ఆమె ప్రియుడు తుషార్ కలిసి అతుల్ కప్పుకున్న దుప్పటిలోపలికి పామును వదిలారు. ఆ పాము కాటు వేయడంతో అతుల్ మ-రణించాడు. శుక్రవారం ఉదయం దామిని ఏమీ తెలియనట్టు భర్తను ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. బెడ్‌పై పాము కూడా దొరకడంతో అంతా నిజమైన పాము కాటుగా నమ్మారు.

**నిందితుల ఫోన్లలో పాము ఫోటో:**

అయితే పాము కాటు వేసిన తీరు అక్కడ పరిస్థితులపై అనుమానం వచ్చిన పోలీసులు సాంకేతిక విశ్లేషణ, మొబైల్ కాల్ డేటాను పరిశీలించారు. దామిని, డ్రైవర్ తుషార్ నిరంతరం మాట్లాడుకున్నట్లు తేలింది. తుషార్ మొబైల్‌ను తనిఖీ చేయగా అందులో ఒక డబ్బాలో బంధించిన పాము ఫోటో లభ్యమైంది.

దీంతో పోలీసులు తమదైన శైలిలో విచారించగా అసలు నిజం ఒప్పుకున్నాడు. పాము తేవడానికి సహాయం చేసినందుకు సోను, ఉదయ్‌లకు రూ. 5 లక్షలు ఇస్తామని ఒప్పందం చేసుకున్నట్లు తెలిపాడు. కాగా 20 రోజుల క్రితం కూడా అతుల్‌ను కారుతో ఢీకొట్టి చంపాలని ప్రయత్నించారని కానీ ఆ సమయంలో హెల్మెట్ ధరించి ఉండటం వల్ల అతను ప్రాణాలతో బయటపడ్డాడని మీరట్ ఎస్ఎస్పీ అవినాష్ పాండే వెల్లడించారు. ప్రస్తుతం నిందితులపై కేసు నమోదు చేసి తదుపరి చర్యలు తీసుకుంటున్నారు.





## వర్షాల కోసం ఈద్గాలో సలాతుల్ ఇస్తిస్కా ప్రత్యేక నమాజ్

**జహీరాబాద్,ఫ్లాష్ ఇండియా :** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో వర్షాల కోసం ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో జమైతుల్ ఉల్మా జహీరాబాద్ ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఈద్గా మైదానంలో శనివారం సలాతుల్ ఇస్తిస్కా ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతుల పంటలు పండాలని, చెరువులు, కుంటలు నిండాలని, ప్రజలకు కరువు కష్టాలు తొలగాలని భగవంతుడిని వేడుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు భగవంతుడిని ఎక్కువగా స్మరించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రత్యేక ప్రార్థనలు మరో రెండు రోజులు ఆదివారం, సోమవారం కూడా కొనసాగించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

# దేశానికే తెలంగాణ మోడల్

## పాఠశాలల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ పాఠశాలలే దేశంలో అత్యుత్తమం
- విద్యార్థులతో క్రికెట్ ఆడిన మంత్రి అజహరుద్దీన్
- ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక విద్యకు తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యం
- విద్యతోనే ఉన్నత శిఖరాలు చేరుకోవాలి
- తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సందర్శించిన మంత్రి అజహరుద్దీన్
- ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దుతున్న తెలంగాణ
- ఆధునిక సౌకర్యాలతో ప్రభుత్వ విద్యకు కొత్త రూపు
- విద్యార్థుల కలలకు బలమైన వేదిక ప్రభుత్వ పాఠశాలలు



**రంగారెడ్డి జిల్లా, ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను దేశంలోనే అత్యుత్తమ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ తెలిపారు. శనివారం రంగారెడ్డి జిల్లా మంచాల్ మండలం ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను మంత్రి సందర్శించి పాఠశాలలోని విద్యా, క్రీడా, మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ఆత్మీయంగా మమేకమై ప్లేగ్రౌండ్‌లో కాసేపు క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, విద్యార్థుల మధ్య ఉండటం ఎంతో ఆనందంగా ఉందని, ఆధునిక సౌకర్యాలతో కూడిన ఈ పాఠశాలను చూసి సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక విద్యా వాతావరణం, డిజిటల్ తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, విశాలమైన క్రీడా మైదానాలు, బాస్కెట్‌బాల్, వాలీబాల్, క్రికెట్ తదితర క్రీడా సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. తమ చిన్నతనంలో ఇలాంటి సౌకర్యాలు లేకపోయినా కష్టపడి చదివి ఎదిగామని, ప్రస్తుతం విద్యార్థులకు లభిస్తున్న అవకాశాలను పూర్తిగా సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విజయం సాధించాలంటే కష్టపడి పనిచేయడం, క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావం అవసరమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను గౌరవించాలని, తల్లిదండ్రుల ఆశలు, త్యాగాలను గుర్తుంచుకోవాలని, ఓటమిని చూసి నిరాశ చెందకుండా నిరంతర సాధనతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో ఏర్పడే స్నేహాలు జీవితాంతం నిలుస్తాయని, పరస్పర గౌరవం, సహకారం, ముఖ్యంగా బాలికలను గౌరవించే సంస్కారాన్ని అలవర్చుకోవాలని అన్నారు. విజయం అనేది ఒక్కరోజులో రాదని, ఉన్నత స్థాయికి చేరుకున్న తర్వాత కూడా వినయాన్ని కోల్పోకుండా నిరాడంబరంగా ఉండటమే నిజమైన గొప్పతనమని పేర్కొన్నారు. ఈ పాఠశాల నుంచి భవిష్యత్తులో వైద్యులు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, క్రీడాకారులు, పరిపాలనా అధికారులు తయారై రాష్ట్రానికి, దేశానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. విద్యార్థులందరికీ ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం విద్యాభివృద్ధికి అనేక వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని బలోపేతం చేస్తూ డైట్ ఛార్జీల పెంపు, విద్యార్థులకు పోషకాహారాన్ని అందించడం వంటి చర్యలు చేపట్టిందన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానం ద్వారా ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే క్యాంపస్‌లో నాణ్యమైన విద్యను అందించేలా ఆధునిక మౌలిక వసతులతో కూడిన పాఠశాలలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు తమకు లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని కృతజ్ఞతాభావంతో చదువుకోవాలని సూచించారు. విజయం అంటే కేవలం పరీక్షల్లో మంచి మార్కులు సాధించడం మాత్రమే కాదని, ఎంచుకున్న ప్రతి రంగంలో అత్యున్నత స్థాయికి చేరుకోవాలనే లక్ష్యంతో శ్రమించాలని చెప్పారు. ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నిరంతర కృషితో ప్రతి విద్యార్థి రాష్ట్రానికి, దేశానికి గర్వకారణం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నవీన్ కుమార్ రెడ్డి, మంచాల్ తహశీల్దార్, ఆరుట్ల సర్పంచ్ శోభారాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా పరీక్షల నిర్వహణ



**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**
విద్యా సంవత్సరం 2026--27కు జనగామ జిల్లాలో ప్రభుత్వం మంజూరు చేసిన 39 నూతన ప్రీ-ప్రైమరీ పాఠశాలల్లో ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల భర్తీకి సంబంధించి శనివారం కలెక్టరెట్ లో నిర్వహించిన వ్రాతపరీక్షలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తయ్యాయి. ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు హ్యాబిటేషన్ (స్థానిక) పరిధిలోని అభ్యర్థుల నుండి మొత్తం 269 దరఖాస్తులు అందగా, వారిలో 254 మంది వ్రాతపరీక్షకు హాజరయ్యారు. 15 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా, ఆయా పోస్టులకు 152 మంది స్థానిక అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.... వారిలో 139 మంది పరీక్షకు హాజరయ్యారు. 13 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు ఒక గంటన్నర , ఆయా పోస్టులకు గంటన్నర వ్యవధిలో వ్రాతపరీక్ష నిర్వహించారు. పరీక్షలను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించారు. ఈ మొత్తం ప్రక్రియను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించారు. పరీక్షల నిర్వహణలో అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, జీసీడిఓ గౌస్యా బేగం, ఏసీజీఈ , డీసీఈబి సెక్రటరీ, కేజీబీవీల అకౌంటెంట్లు, ఉపాధ్యాయులు, ఇన్‌స్ట్రక్టర్లు, ఇతర విద్యాశాఖ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించి పరీక్షలను విజయవంతంగా పూర్తి చేశారు.



# ఎల్‌నినో ప్రభావం,పంటల మార్పిడిపై రైతులకు అవగాహన

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**
అడవిదేవులపల్లి మండలం ఉల్సాయిపాలెం గ్రామంలో శనివారం క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) అబ్దుల్ సమీ ఆధ్వర్యంలో రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావం వల్ల తలెత్తే పరిస్థితులు,వర్షాభావ సూచనలను దృష్టిలో ఉంచుకుని రైతులు సాంప్రదాయ పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఏఈఓ అబ్దుల్ సమీ మాట్లాడుతూ వాతావరణ మార్పుల వల్ల నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున,ఎక్కువ నీరు అవసరమయ్యే పంటల జోలికి వెళ్లకుండా తక్కువ నీటితో, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఇచ్చే ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. పంటల మార్పిడి ద్వారా భూసారం పెరగడమే కాకుండా తెగుళ్ల ఉధృతిని కూడా తగ్గించవచ్చని వివరించారు.రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ,ప్రభుత్వ సూచనలను పాటిస్తూ నష్టాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజాకవి అందెశ్రీని ఆదర్శంగా తీసుకోవాలి



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**
మిర్యాలగూడ మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జప్తి వీరప్పగూడెం నందు ప్రజా కవి తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందే శ్రీ (ఎల్లయ్య) 66 వ జయంతి సందర్భంగా శనివారం వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బొలిశెట్టి బిక్షపతి మరియు తెలుగు ఉపాధ్యాయులు గుడిపాటి కోటయ్య మాట్లాడుతూ నిత్యం ప్రజా జీవితంలో ఉంటూ ఏమాత్రం చదువురాని వ్యక్తి కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ మరియు భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డులను పొందడం వారి లోకానుశీలతకు నిదర్శనం. లోకజ్ఞానంతో తెలంగాణ రాష్ట్ర గీతం తో పాటు మలిదశ తెలంగాణ ఉద్యమంలో ధూమ్ దాంల తో ప్రజలను తెలంగాణ ఉద్యమం వైపు ఆకర్షితులను చేసిన వ్యక్తి అని,నేటి సమాజంలో అంతరించిపోతున్న మానవ విలువలను గుర్తు చేస్తూ "మాయమైపోతున్నమ్మా మనిషన్నవాడు" అనే పాట తో పాటు అనేక సినిమా పాటలు రాసి నేటి యువతకు ప్రజలకు ఆదర్శంగా నిలిచారని వారిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుడిపాటి కోటయ్య,యడవల్లి దామోదర్ రెడ్డి,జగదీశ్వర్ రెడ్డి,ఒట్టె మాధవి,శ్రీనివాసరెడ్డి,జల్ రామ్ తదితరులు పాల్గొన్నారు.



# అయ్యప్ప స్వామి దేవాలయ ట్రస్టు రద్దుకు భక్తుల నిరసన

**భూదాన్ పోచంపల్లి,ఫ్లాష్ ఇండియా :**
భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయ ట్రస్టును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం దేవాలయం ఎదుట గురుస్వాములు, అయ్యప్ప భక్తులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో దేవాలయానికి ఎలాంటి ట్రస్టు లేదని పేర్కొన్న కొందరు వ్యక్తులు, ప్రస్తుతం తామే ట్రస్టు సభ్యులమంటూ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఈ విధానాన్ని భక్తులు, గురుస్వాములు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. దేవాలయ అభివృద్ధి, పరిరక్షణే లక్ష్యంగా ప్రస్తుతం ఉన్న ట్రస్టును పూర్తిగా రద్దు చేయాలని భక్తుల సమక్షంలో నిర్వహించిన సమావేశంలో సభ్యులందరూ ఏకగ్రీవంగా తీర్మానించినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో దేవాలయ అభివృద్ధి కోసం అందరినీ కలుపుకొని ముందుకు సాగే విధంగా నూతన సూచన కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు గంగపురం వెంకటేష్ గౌడ్, బొడిగె బాబు, భోగ విష్ణు, శెట్టి శ్రీనివాస్, వంగూరి పాండు, కొయ్యడ శ్రీను, దోర్నాల గణేష్, ముప్పిడి శ్రీనివాస్, శంకర్, వీరేష్, కీర్తి సంజీవ్, అంకం వినోద్, అంకం సాయి, చెక్క సాయి తదితరులు పాల్గొన్నారు.


# రైస్ మిల్లుల నుండి వెలువడే వ్యర్థపు నీటితో చేపలు మృత్యువాత



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**
మిర్యాలగూడ పట్టణ పరిధిలోని తుంగపాడు గ్రామ శివారులో పంట పొలాల సేద్యానికి,పశువుల దాహాన్నికి ఉపయోగించే తుంగపాడు వాగు నీటిలోకి గ్రామ శివారులోని మహావిష్ణు,వంశీ సాయి రైస్ మిల్స్ నుండి వెలువడే వ్యర్థపు నీటిని పైపు లైన్ ద్వారా వాగులోకి కలపడం జరుగుతుంది. వ్యర్థపు నీటిని కలపడం వల్ల చేపలు మృత్యువాత పడ్డాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇట్టి నీటిని పంట పొలాలకు,పశువులకు వాడతామన్నారు. ఈ వ్యర్థపు నీటి వలన చర్మవ్యాధులతో, పశువులకు వ్యాధులు సోకుతున్నాయి అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి రైస్ మిల్లులపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

# విద్యాలయాల్లో వికృత చేష్టలు వద్దు

**హనుమకొండ,ఫ్లాష్ ఇండియా :**




విద్యాలయాల్లో వికృత చేష్టలు వద్దు, ర్యాగింగ్ రహిత సమాజం దిశగా అడుగులు వేద్దామని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె. పూజ పిలుపునిచ్చారు. శనివారం భట్టుపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ నివాస మహిళా డిగ్రీ కళాశాల, వరంగల్‌లో వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో "ప్రొహిబిషన్ ఆఫ్ ర్యాగింగ్ యాక్ట్-1997" చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన న్యాయమూర్తి కె. పూజ మాట్లాడుతూ ర్యాగింగ్ అనేది విద్యార్థుల జీవితాలను చిన్నాభిన్నం చేసే ఒక సామాజిక భూతం అని పేర్కొన్నారు. ర్యాగింగ్ అనేది కేవలం వినోదం కోసం మొదలై, నేడు మానసిక, శారీరక హింసకు, బలవన్మరణాలకు దారితీస్తోందని వాపోయారు. విద్యాసంస్థల్లో సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేయడం, అవమానించడం నేరమని పేర్కొన్నారు. బాధితులు మానసిక ఒత్తిడికి లోనై, చదువును మధ్యలోనే ఆపివేయడం లేదా భయంతో ఆత్మహత్యలకు పాల్పడడం జరుగుతోందని వివరించారు. ర్యాగింగ్‌ను తీవ్రమైన నేరంగా పరిగణిస్తూ, ర్యాగింగ్‌కు పాల్పడినట్లు రుజువైతే విద్యాసంస్థల నుంచి బహిష్కరించడమే కాకుండా, చట్టప్రకారం జైలు శిక్షతో పాటు భారీ జరిమానా కూడా విధిస్తారని తెలిపారు. ర్యాగింగ్ కేసుల్లో చిక్కుకున్న విద్యార్థులకు భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలు, పాస్‌పోర్ట్, ఇతర ఉన్నత అవకాశాలు లభించవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఆర్. సురేష్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఆర్. రజిని, కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. రాధిక, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# కిడ్నాప్ కేసులో కొత్త కోణం




**శేరిలింగంపల్లి,ఫ్లాష్ ఇండియా :** లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న మూడేళ్ల చిన్నారిని కిడ్నాప్ చేసిన కేసును చందానగర్ పోలీసులు గంటల వ్యవధిలోనే ఛేదించారు. అక్రమ దత్తతల పేరుతో చిన్నారులను అమ్మే ముఠాలోని ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి చిన్నారిని సురక్షితంగా తల్లికి అప్పగించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి వెల్లడించారు. అనంతపురం జిల్లా గుంతకల్‌కు చెందిన గోవిందమ్మ తన మూడేళ్ల కుమార్తె పుష్పరాణితో కలిసి జూలై 15 రాత్రి లింగంపల్లి రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నంబర్-6 సమీపంలోని భవానీ హోటల్ ముందు ఫుట్‌పాత్‌పై నిద్రించింది. జూలై 16 తెల్లవారుజామున నిద్రలేచి చూసేసరికి చిన్నారి కనిపించకపోవడంతో చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు.

**నవజాత శిశువుల వివరాలు సేకరించి..**

సైబరాబాద్, వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో విస్తృతంగా గాలింపు చేపట్టిన పోలీసులు కొత్తి శ్రీనివాస్, దోమ రామకృష్ణ, పలాది నవనీతలను గుర్తించి అరెస్ట్ చేశారు. చిన్నారిని కొనుగోలుదారుడికి అప్పగించే ఏర్పాట్లు జరుగుతుండగానే దాడి చేసి పాపను సురక్షితంగా రక్షించారు. దర్యాప్తులో అక్రమ దత్తతల పేరుతో బాలల అక్రమ రవాణా నెట్‌వర్క్ వెలుగుచూసింది. మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ డయాగ్నస్టిక్ ల్యాబ్‌లో పనిచేస్తున్న నవనీత, సంతానం లేని దంపతులను లక్ష్యంగా చేసుకుని మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆసుపత్రుల ద్వారా గర్భిణులు, నవజాత శిశువుల వివరాలు సేకరించి అక్రమ దత్తతలకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడైంది. రెండు లక్షల రూపాయలకు చిన్నారిని విక్రయించేందుకు ఒప్పందం కుదుర్చుకుని, ముందస్తు ప్రణాళిక ప్రకారం, లింగంపల్లి ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న చిన్నారిని కిడ్నాప్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో మరికొందరి ప్రమేయం, ఆర్థిక లావాదేవీలు, అక్రమ దత్తతల నెట్‌వర్క్‌పై మరింత లోతుగా దర్యాప్తు కొనసాగుతోందని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి తెలిపారు.



# కట్టంగూర్ మండలంలో తీవ్ర విషాదం..

**కట్టంగూరు,ఫ్లాష్ ఇండియా :** నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం లో విషాద సంఘటన చోటు చేసుకుంది. నిన్న ఒకే గ్రామంలో నిన్న ఓ యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా.. ఈ రోజు ఓ యువకుడు ఆత్మహత్య చేసుకోవడం కలకలం గా మారింది. కట్టంగూర్ మండల పరిధిలోని మునుకుంటల గ్రామంలో 24 గంటల వ్యవధిలో జరిగిన రెండు మరణాలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఒకే గ్రామానికి చెందిన ఒక యువతి నిన్న అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా, ఆ మరుసటి రోజైన ఈరోజు ఉదయం అదే గ్రామానికి చెందిన చరణ్ అనే యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఒకరి తర్వాత ఒకరు ఇలా వరుసగా ప్రాణాలు కోల్పోవడంతో మునుకుంట్ల గ్రామంలో తీవ్ర విషాదం నెలకొనడంతో పాటు స్థానికంగా పలు అనుమానాలు, తీవ్ర ఉత్కంఠ వ్యక్తమవుతున్నాయి. ఈ రెండు ఘటనలపై సమాచారం అందుకున్న కట్టంగూర్ పోలీసులు తక్షణమే గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతి చెందిన యువతికి, ఈరోజు ఆత్మహత్య చేసుకున్న చరణ్‌కు మధ్య ఏమైనా సంబంధం ఉందా? వీరి వరుస మరణాల వెనుక ఏదైనా ప్రేమ వ్యవహారం ఉందా లేక మరేదైనా కారణాలు ఉన్నాయా? అన్న కోణంలో పోలీసులు పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో ముమ్మరంగా దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వెల్లడించారు.



# చరిత్ర పునరావృతం..

భారత క్రికెట్‌లో సీనియర్ ఆటగాళ్ల భవిష్యత్తు, యువ రక్తాన్ని ప్రోత్సహించడంపై జరుగుతున్న చర్చలు ఇప్పుడు కెప్టెన్ రోహిత్ శర్మ వన్డే కెరీర్‌తో మళ్లీ మొదటికి వచ్చాయి. రోహిత్ శర్మను వన్డే జట్టు నుంచి తప్పించాలనే ఆలోచనలు తెరపైకి రావడం చూస్తుంటే.. గతంలో ఎంఎస్ ధోనీ సారథ్యంలో అమలు చేసిన వివాదాస్పద 'రోటేషన్ పాలసీ' రోజులు గుర్తొస్తున్నాయి. నాటి ధోనీ వ్యూహాల త-రహాలోనే ఇప్పుడు రోహిత్ శర్మ సైతం సెలెక్టర్ల మార్పుల చక్రబంధంలో చిక్కుకోవడం గమనార్హం. ఇక, గతంలోకి వెళ్తే.. 2012 సీబీ సిరీస్ సమయంలో అప్పటి కెప్టెన్ ధోనీ, భవిష్యత్తు ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని సచిన్, సెహ్వాగ్, గంభీర్ వంటి ముగ్గురు దిగ్గజ ఓపెనర్లను మార్చి మార్చి ఆడించే రోటేషన్ విధానాన్ని తీసుకొచ్చారు. అయితే, ఆ సమయంలో మంచి ఫామ్‌లో ఉన్న రోహిత్ శర్మ వంటి యువకుడిపై సెలెక్టర్లు నమ్మకం ఉంచి, సీనియర్లను పక్కనపెట్టడం అప్పట్లో తీవ్ర వివాదాలకు దారితీసింది. ఇప్పుడు కాలం తిరిగొచ్చింది.. నాడు యువకుడిగా జట్టులోకి వచ్చిన అదే రోహిత్ శర్మ, నేడు తన కెరీర్ ముగింపు దశలో సరిగ్గా అలాంటి పరిస్థితినే ఎదుర్కొంటూ చరిత్ర పునరావృతమవడాన్ని చూస్తున్నారు. టెస్టులు, టీ20ల నుంచి ఇప్పటికే తప్పుకున్న రోహిత్ శర్మ, వన్డేల్లోనూ ఆశించిన స్థాయిలో రాణించలేకపోవడంతో ఇప్పుడు వన్డే జట్టులోనూ తన స్థానాన్ని కోల్పోయే ప్రమాదంలో పడ్డాడు. అతని స్థానంలో యశస్వి జైస్వాల్ వంటి యువ సంచలనాలకు వన్డే జట్టులో శాశ్వత చోటు కల్పించాలని సెలెక్టర్లు గట్టిగా భావిస్తున్నారు. భవిష్యత్తు ప్రణాళికల్లో భాగంగా రోహిత్ శర్మపై వేటు వేసేందుకు సెలెక్షన్ కమిటీ సిద్ధమవ్వడం, నాడు ధోనీ సీనియర్లను పక్కనపెట్టిన కఠిన నిర్ణయాన్నే తలపిస్తోంది. ఈ పరిణామాలు భారత క్రికెట్ వర్గాల్లో పెద్ద సంచలనంగా మారాయి. జట్టు భవిష్యత్తు కోసం యువ ఆటగాళ్లను ప్రోత్సహించడం ఎంత అవ-సరమే అయినప్పటికీ, రోహిత్ శర్మ వంటి దిగ్గజ ఆటగాడిని గౌరవప్రదంగా సాగనంపాలని అభిమానులు కోరుకుంటున్నారు. సీనియర్లను పక్కనపెట్టి యువ రక్తాన్ని నింపే క్రమంలో బీసీసీఐ, సెలెక్టర్లు తీసుకుంటున్న ఈ కఠిన నిర్ణయాలు ప్రస్తుతం క్రికెట్ ప్రపంచంలో అత్యంత ఆసక్తికరమైన చర్చకు దారితీస్తున్నాయి.

# చరిత్రలోనే అత్యంత ఖరీదైన మ్యాచ్..!




ఫుట్‌బాల్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫిఫా వరల్డ్‌కప్ 2026 ఫైనల్ మ్యాచ్ టికెట్ ధరలు రికార్డులను బద్దలు కొట్టాయి. లియోనెల్ మెస్సీ నేతృత్వంలోని అర్జెంటీనా, యువ ఆటగాళ్లతో బలంగా ఉన్న స్పెయిన్ జట్టు మధ్య జరగనున్న ఈ తుది సమరానికి ప్రపంచవ్యాప్తంగా భారీ డిమాండ్ నెలకొంది. అమెరికాలోని న్యూజెర్సీ, ఈస్ట్ రదర్‌ఫోర్డ్‌లో ఉన్న మెట్‌లైఫ్ స్టేడియం వేదికగా జూలై 20న ఈ మ్యాచ్ జరగనుండగా.. భారత కాలమానం ప్రకారం రాత్రి 12:30 గంటలకు మొదలు కానుంది.

**కొత్త చరిత్ర:**

టికెట్ రీసేల్ ప్లాట్‌ఫామ్ TickPick వెల్లడించిన వివరాల ప్రకారం.. ఫుట్ బాల్ ఫైనల్ మ్యాచ్ కోసం అభిమానులు భారీగా ఖర్చు చేస్తున్నారు. ఒక్కో టికెట్‌కు సగటున 11,327 అమెరికన్ డాలర్లు (భారత కరెన్సీలో దాదాపు రూ.11 లక్షలు) చెల్లిస్తున్నారు. అమెరికా క్రీడా చరిత్రలో ఏ క్రీడా ఈవెంట్‌కైనా నమోదైన అత్యధిక సగటు టికెట్ ధర ఇదేనని TickPick తెలిపింది. నిజానికి అమెరికాలో అత్యంత ప్రజాదరణ పొందిన క్రీడా ఈవెంట్‌గా భావించే రాబజూవతీ Bowl LVIII టికెట్ ధరల రికార్డును కూడా ఈ ఫిఫా ఫైనల్ అధిగమించింది. ఆ మ్యాచ్‌కు సగటు టికెట్ ధర 9,411 డాలర్లు (సుమారు రూ.9 లక్షలు) ఉండగా.. ఇప్పుడు ఫిఫా ఫైనల్ దానికంటే ఎక్కువ ధరతో సరికొత్త రికార్డు సృష్టించింది.

**చౌక టికెట్ రూ.6.7 లక్షలు:**

ఈ మ్యాచ్‌ను స్టేడియంలో ప్రత్యక్షంగా వీక్షించాలంటే భారీ మొత్తాన్ని ఖర్చు చేయాల్సిందే. TickPickలో అందుబాటులో ఉన్న అత్యంత తక్కువ ధర టికెట్ కూడా 6,943 డాలర్లు (సుమారు రూ.6.7 లక్షలు)గా నమోదైంది. అయినప్పటికీ టికెట్లకు డిమాండ్ ఏమాత్రం తగ్గడం లేదని సమాచారం. ఈ ఫైనల్ మ్యాచ్‌లో ఒకవైపు స్పెయిన్ ప్రపంచకప్‌ను కైవసం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకోగా.. మ-రోవైపు లియోనెల్ మెస్సీ వరుసగా రెండో ప్రపంచకప్ టైటిల్‌ను గెలిచి తన అద్భుత కెరీర్‌ను మరింత చిరస్మరణీయంగా మార్చాలని భావిస్తున్నాడు. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ అభిమానుల దృష్టి మొత్తం ఈ మెగా ఫైనల్ పైనే నిలిచింది.




## వన్డే వరల్డ్ కప్ ఫార్మాట్‌లో మార్పులు..

రాబోయే 2027 పురుషుల వన్డే ప్రపంచకప్ ఫార్మాట్‌లో ఐసీసీ చేసిన మార్పులపై వరల్డ్ క్రికెటర్స్ అసోసియేషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కనీసం తమకు సమాచారం లేకుండా ఫార్మాట్‌ను మార్చడంపై క్రికెటర్ల సంఘం అభ్యంతరం వ్యక్తం చేసింది. తాజాగా మార్పులు ప్రపంచ క్రికెట్ వృద్ధిని ప్రశ్నార్థకం చేస్తున్నాయని డబ్ల్యూసీఏ స్పష్టం చేసింది. అభివృద్ధి చెందుతున్న దేశాలు ఈ వరల్డ్ కప్ కోసం ఏళ్ల తరబడి పెట్టుబడులు పెట్టి, క్వాలిఫికేషన్ మార్గాలను సిద్ధం చేసుకున్నాయని తెలిపింది. ఇలా కొత్త ఫార్మాట్ ఆ అవకాశాలను నీరుగారు-స్తున్నారని వరల్డ్ క్రికెట్ అసోసియేషన్ పేర్కొంది. క్రికెట్ అభివృద్ధిలో కీలక భాగస్వాములైన క్రీడాకారులు, ఇతర వర్గాలతో సంప్రదించకుండానే ఇలాంటి పెద్ద నిర్ణయాలు తీసుకోవడం సరైన పద్ధతి కాదని క్రికెటర్ల సంఘం సీఈవో టామ్ మోఫాట్ విమర్శించారు. కొత్త ఫార్మాట్ ద్వారా దిగువ శ్రేణి జట్లకు పెద్ద జట్లతో ఆడే అవకాశం తగ్గిపోతుందని వాదిస్తున్నారు.కాగా, దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికగా జరగనున్న 2027 పురుషుల వన్డే ప్రపంచకప్ టోర్నీలో ఈసారి 14 జట్లు పాల్గొనబోతున్నాయి. అయితే, గతంలో అనుకున్న ఫార్మాట్‌కు భిన్నంగా ఇప్పుడు కొత్తగా త్రీ-స్టేజ్ స్ట్రక్చర్‌ను ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా, ర్యాంకింగ్‌లో దిగువన ఉన్న మూడు జట్లు ముందుగా ప్రిలిమినరీ సూపర్ సిరీస్ ఆడాల్సి ఉంటుంది. ఆ తర్వాతే గ్రూప్ స్టేజ్, సూపర్ 7 రౌండ్లు, నాకౌట్స్ ఉంటాయి. దీంతో వరల్డ్ క్రికెటర్స్ అసోసియేషన్ ఈ ఫార్మాట్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.

# ఇంగ్లాండ్ బంపర్ ఆఫర్...



టెస్టులకు కొత్త కోచ్ ను నియామకం చేసే పనిలో పడింది ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు. ఇందులో భాగంగానే చాలా మంది పేర్లను పరిశీలన చేస్తోంది. ఇప్పటికే రాహుల్ ద్రావిడ్, రవిచంద్రన్ అశ్విన్ లాంటి వాళ్లను ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు సంప్రదించింది. తాజాగా RCB హెడ్ కోచ్ ఆండీ ఫ్లవర్ పేరు తెరపైకి వచ్చింది. దీంతో బెంగళూరును వదిలి ఇంగ్లాండ్ వెళ్తాడని కూడా జోరుగా ప్రచారం సాగింది.అయితే దీనిపై తాజాగా RCB హెడ్ కోచ్ ఆండీ ఫ్లవర్ క్లారిటీ ఇచ్చారు. ఇంగ్లాండ్ టెస్ట్ టీం కోచ్ గా మళ్లీ బాధ్యతలు చేపట్టే ఆసక్తి తనకు లేదని వెల్లడించారు. ప్రస్తుతం చేస్తున్న పనితో తాను సంతృప్తిగా ఉన్నానని.. అతిగా ఆశపడబోనని వివరించారు. గతంలో ఇంగ్లాండుకు పని చేసినప్పటికీ... ఆఫర్ రిజెక్ట్ చేసినట్లు వెల్లడించారు. ఇది ఇలా ఉండగా 2009 నుంచి 2014 వరకు ఇంగ్లాండ్ కోచ్ గా ఆండీ ఫ్లవర్ పనిచేశారు. ఆ తర్వాత కాస్త రెస్ట్ తీసుకున్న ఆయన... 2024 నుంచి బెంగళూరు హెడ్ కోచ్ పదవి చేపట్టారు. ఈయన వచ్చిన తర్వాతే బెంగళూరు టైటిల్స్ కొట్టడం మొదలుపెట్టింది.

# బిజినెస్



## వాణిజ్య ఒప్పందానికి శుభారంభం

భారత్, బ్రిటన్ (యూకే) మధ్య చారిత్రాత్మక 'సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం' (సీఈటీఏ) బుధవారం నుంచి అధికారికంగా అమల్లోకి రావడం దేశీ వాణిజ్య రంగానికి సరికొత్త మైలురాయిగా నిలిచింది. ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) అమల్లోకి వచ్చిన మొదటి రోజే భారత్ నుంచి 140 మిలియన్ డాలర్ల(రూ. 1,350 కోట్ల) విలువైన 50 సరుకుల రవాణా యూకేకు విజయవంతంగా జరిగిందని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఈ సరికొత్త అధ్యాయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పందిస్తూ, ఈ ఒప్పందం మన రైతులు, పారిశ్రామికవేత్తలు, చిన్న-మధ్యతరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) సరికొత్త ఊపునిస్తూ ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దీనివల్ల టెక్స్‌టైల్స్, చేతివృత్తులు, ఇంజనీరింగ్, సముద్ర ఆహార ఉత్పత్తులతో పాటు రత్నాలు, ఆభరణాల రంగానికి బ్రిటన్ మార్కెట్లో 'జీరో టాక్స్' ప్రవేశం లభించింది. మొదటి రోజే మన ఎగుమతిదారులు దాదాపు 10 మిలియన్ డాలర్ల(రూ. 96 కోట్ల) విలువైన బంగారు, వజ్రాల ఆభరణాలను బ్రిటన్‌కు పంపగా, రాబోయే మూడేళ్లలో ఈ ఎగుమతులు 2.5 బిలియన్ డాలర్ల(రూ. 24 వేల కోట్ల)కు చేరుకుంటాయని పరిశ్రమల మండలి ధీమాగా వ్యక్తం చేసింది. కస్టమ్స్ క్లియరెన్స్, డిజిటల్ సర్టిఫికెట్ల జారీ పరంగా మొదటి రోజు నుంచే ఎగుమతిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అత్యంత సులభతరమైన ఏర్పాట్లు చేసినట్లు వాణిజ్య కార్యదర్శి రాజేష్ అగర్వాల్ పేర్కొన్నారు.



## పెరిగిన బంగారం, తగ్గిన వెండి..

గత రెండు రోజుల నుంచి తగ్గుతూ వచ్చిన బంగారం ధరలు ఈ రోజు (శనివారం) పెరిగాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై 760 రూపాయలు.. 22 క్యారెట్ల బంగారంపై 700 రూపాయలు.. 18 క్యారెట్ల బంగారంపై 570 రూపా-యలు పెరిగింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. ఉదయం 10 గంటల ప్రాంతంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,43,290 రూపాయల వద్ద.. 22 క్యారెట్ల బంగారం ధర 1,31,350 రూపాయల వద్ద.. 18 క్యారెట్ల బంగారం ధర 1,07,470 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది.

**తగ్గిన వెండి ధరలు..**

గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. ఉదయం 10 గంటల ప్రాంతంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 100 గ్రాముల వెండి ధర 23,000 రూపాయల వద్ద.. కేజీ వెండి ధర 2,30,000 వద్ద ట్రేడ్ అవుతోంది.



## గ్యాస్ సిలిండర్ ధరలు

రీసెంట్‌గా కేంద్ర ప్రభుత్వం హోటళ్లు, రెస్టారెంట్లు తదితర వ్యాపారులకు ఊరటనిస్తూ కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించిన విషయం తెలిసిందే. 19 కేజీల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్‌పై రూ.183 తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రస్తుతం హైదరాబాద్‌లో కమర్షియ-ల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.3,191గా ఉంది. ఇక, గృహ వినియోగ ఎల్‌పిజి ధరల్లో ఎలాంటి మార్పులు లేవు.

**జులై 18వ తేదీ నాటి గ్యాస్ సిలిండర్ ధరలు..**

హైదరాబాద్: రూ.994.00
వరంగల్: రూ.1013.00
విశాఖపట్నం: రూ.950.00
విజయవాడ: రూ.966.50
గుంటూరు: రూ.966.50

## పేపర్ కరెన్సీకి చెల్లు..



భారతీయ కరెన్సీ రంగంలో సరికొత్త విప్లవానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శ్రీకారం చుట్టబోతోంది. మార్కెట్లోకి త్వ-రలోనే అత్యంత మన్నికైన, అత్యాధునిక 'పాలిమర్ నోట్లు' రంగప్రవేశం చేయనున్నాయి. సాంప్రదాయ కాగితపు నోట్ల స్థానంలో ఈ కొత్త తరహా ప్లాస్టిక్ కరెన్సీని ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తెచ్చేందుకు కేంద్ర బ్యాంక్ శరవేగంగా సన్నాహాలు చేస్తోంది. ఈ క్రమంలోనే 2027 నాటికి ఈ సరికొత్త నోట్లను పూర్తి స్థాయిలో దేశవ్యాప్తంగా సామాన్యుడి వినియోగంలోకి తీసుకురావాలన్నది ఆర్‌బీఐ ప్రధాన ఆలోచనగా ఉందని జాతీయ మీడియా సంస్థ 'ఎన్డీటీవీ ప్రాఫిట్' తన తాజా కథనంలో ప్రత్యేకంగా పేర్కొంది. ఈ భారీ ప్రాజెక్టులో భాగంగా ఆర్‌బీఐ తొలి దశలో పైలట్ ప్రాజెక్ట్ రూపంలో తక్కువ ముఖ విలువ కలిగిన రూ. 10 మరియు రూ. 20 నోట్లను మార్కెట్లోకి విడుదల చేయనుంది. ఈ ప్రయోగాత్మక చలామణీ ద్వారా ప్రజల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్, క్షేత్రస్థాయి సవాళ్లు మరియు సాధకబాధకాలను సమగ్రంగా పరిశీలించి, అవసరమైన మార్పులతో 2027 నాటికి పూర్తి స్థాయి ముద్రణను ప్రారంభించాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అయితే పాలిమర్ నోట్లు మార్కెట్లోకి వచ్చినప్పటికీ, ప్రస్తుతం చలామణీలో ఉన్న పాత పేపర్ కరెన్సీ ఎప్పటిలాగే చెల్లుబాటు అవుతుందని, ఎలాంటి ఆందోళన అవ-సరం లేదని, దశలవారీగా మాత్రమే పాత నోట్ల స్థానాన్ని ఈ పాలిమర్ నోట్లు భర్తీ చేస్తాయని స్పష్టమవుతోంది.

**టెండర్ల ప్రక్రియ షురూ**

ఈ వినూత్న పాలిమర్ కరెన్సీ నోట్ల ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఇటీవల అధికారికంగా వెల్లడించడం ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సరికొత్త కరెన్సీ నోట్లను ముద్రించడానికి ఉపయోగించే అత్యంత ప్రత్యేకమైన పదార్థమైన 'పాలిమర్ సబ్‌స్ట్రేట్ షీట్ల' తయారీకి ఆర్‌బీఐ నోట్ల ముద్రణా విభాగం ఇప్పటికే టెండర్లను కూడా జారీ చేసింది. ఆయా అంతర్జాతీయ సరఫరాదారులు ఆగస్టు 18 నాటికి తమ బిడ్లను దాఖలు చేయాలని ఆర్‌బీఐ సూచించడంతో ఈ సరికొత్త కరెన్సీ రాకపై వస్తున్న వాదనలకు మరింత బలం చేకూరినట్లయింది. దేశంలో రోజురోజుకూ పెరిగిపోతున్న నకిలీ నోట్ల ప్పును పూర్తిగా అరికట్టడం, అలాగే చలామణీలో ఉండే కరెన్సీ నోట్ల మన్నికను పెంచడమే ఈ పాలిమర్ నోట్ల వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశం. ఈ ప్లాస్టిక్ నోట్లు పూర్తిగా తడిని తట్టుకోగలవు, పొ-రపాటున నీళ్లలో నానినా పాడవవు. అంతేకాకుండా, ఇవి సాధారణ కాగితంలా అంత సులభంగా చిరిగిపోవు, మురికిగా మారి నల్లబడటం వంటి సమస్యలు అస్సలు ఉండవు. ఫలితంగా ప్రభుత్వానికి ఏటా కొత్త నోట్ల ముద్రణ కోసం అయ్యే వేల కోట్ల రూపాయల ప్రజాధనం ఆదా అవ్వడమే కాకుండా, నకిలీ నోట్లను త-యారు చేయడం అసాధ్యంగా మారుతుందని నిపుణులు అంచనా వే స్తున్నారు.




# బర్త్‌డే స్పెషల్‌గా విష్ణు పోస్టర్ రిలీజ్..

విష్ణు విశాల్, మమితా బైజు జంటగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'ఇరందు వానం'. రామ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. 'ముండాసుపట్టి', 'రాక్షసన్' లాంటి బ్లాక్ బస్టర్ చిత్రాల తర్వాత విష్ణు విశాల్, దర్శకుడు రామ్ కుమార్ కాంబినేషన్‌లో వస్తోన్న మూడవ చిత్రం ఇది. ఇప్పటికే షూటింగ్ చివరి దశకు చేరుకున్న ఈ చిత్రం నుంచి ఓ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. విష్ణు విశాల్ బర్త్‌డే సందర్భంగా ఆయనకు విశెష్ తెలుపుతూ ఓ స్పెషల్ పోస్టర్ షేర్ చేశారు. 'ఎగ్జైటింగ్ అప్డేట్స్ లోడింగ్' అనే క్యాప్షన్ ఇచ్చి షేర్ చేసిన ఈ పోస్టర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది.

ఇటీవల విడుదలైన 'లెనిన్' మాత్రం భాగ్యశ్రీ కెరీర్‌లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది. ఈ చిత్రంలో ఆమె నటనకు ప్రేక్షకులతో పాటు సినీ విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు దక్కాయి. ఈ విజయంతో నిర్మాతల దృష్టి మరోసారి భాగ్యశ్రీపై పడింది. ప్రస్తుతం ఆమె చేతిలో ఇప్పటికే మూడు సినిమాలు ఉండగా, కొత్త ప్రాజెక్టుల కోసం కూడా చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, 'లెనిన్' విడుదలకు ముందు భాగ్యశ్రీ ఒక్కో సినిమాకు సుమారు రూ.1.5 కోట్లు పారితోషికంగా తీసుకునేవారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందని తెలుస్తోంది. తాజా విజయంతో ఆమె తన రెమ్యునరేషన్‌ను దాదాపు రూ.3 కోట్లకు పెంచినట్లు టాక్ వినిపిస్తోంది. కొత్తగా వచ్చే ప్రతి ప్రాజెక్ట్‌కు ఇదే మొత్తాన్ని డిమాండ్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.ప్రస్తుతం ఆమె ప్రధానంగా తెలుగు చిత్రాలకే ప్రాధాన్యత ఇస్తున్నప్పటికీ, ఇతర భాషల్లోనూ అవకాశాలు అందుకుంటున్నారు. ముఖ్యంగా తమిళ స్టార్ హీరో శివకార్తికేయన్ నటిస్తున్న 'సేయోన్' చిత్రంలో కథానాయికగా నటిస్తున్నారు. ఈ సినిమా ద్వారా భాగ్యశ్రీ తమిళ చిత్రసీమలో కూడా అడుగుపెడుతున్నారు. ఒక్క హిట్ నటుల కెరీర్‌ను ఎంత వేగంగా మార్చగలదో భాగ్యశ్రీ బోర్సే ప్రయాణం మరోసారి నిరూపిస్తోంది. వరుస పరాజయాలు ఎదురైనా అవకాశాలను వదులుకోకుండా ముందుకు సాగిన ఆమె, ఇప్పుడు పెరుగుతున్న డిమాండ్‌తో టాలీవుడ్‌లో బిజీ హీరోయిన్ల జాబితాలో చోటు సంపాదిస్తోంది. ఇక రాబోయే సినిమాలు కూడా విజయవంతమైతే, భాగ్యశ్రీ బోర్సే కెరీర్ మరింత వేగంగా ముందుకు సాగే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## భారీ రెమ్యునరేషన్ డిమాండ్




# నైజాం హక్కులు సొంతం

నేచురల్ స్టార్ నాని, ఖయాదు లోహర్ జంటగా నటిస్తున్న చిత్రం 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. మొదట ఈ సినిమాను ఆగస్టు 21న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించినప్పటికీ, ఆ తేదీన విడుదల కావడం కష్టమేనని ఇటీవల వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం, ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25న విడుదల చేసే దిశగా మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.ఆ అంచనాలకు తగ్గట్టుగానే ఈ మూవీ నైజాం థియేట్రికల్ హక్కులు రికార్డు ధరకు అమ్ముడైనట్లు సమాచారం. ప్రస్తుతం వినిపిస్తున్న సమాచారం ప్రకారం, మైత్రి డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఈ సినిమా నైజాం థియేట్రికల్ హక్కులను ఏకంగా రూ.37 కోట్ల భారీ మొత్తానికి సొంతం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో నైజాం ఏరియాలో ఈ చిత్రం బ్రేక్ ఈవెన్ సాధించి హిట్ స్టేటస్ అందుకోవాలంటే దాదాపు రూ.70 కోట్ల గ్రాస్ కలెక్షన్లు రాబట్టాల్సి ఉంటుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అంతటి వసూళ్లను సాధించాలంటే సినిమాకు సూపర్ హిట్ టాక్ రావడం తప్పనిసరి అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.






# బాలయ్య ఫ్యాన్స్ కు గుడ్ న్యూస్..

నందమూరి బాలయ్య గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇండస్ట్రీలో సీనియర్ హీరోగా కొనసాగుతున్న ఆయన.. ఏడాదికి ఒక్క సినిమా అయినా రిలీజ్ చేస్తున్నారు. వరుసగా సినిమాలు చేసుకుంటూనే.. రాజకీయాల్లో తన పాత్ర అద్భుతంగా పోషిస్తున్నారు. ఇందులో భాగంగానే ప్రస్తుతం నందమూరి బాలయ్య గోపీచంద్ మలిలేని దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. NBK 111 వర్కింగ్ టైటిల్ తో ఈ సినిమా వస్తోంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఈ మూవీ ఉంది. ఇలాంటి నేపథ్యంలో బిగ్ అప్డేట్ వచ్చేసింది.డిసెంబర్ మూడో వారంలో ఈ సినిమా రిలీజ్ కానున్నట్లు ఇండస్ట్రీలో టాక్ నడుస్తోంది. ప్రభాస్ చేస్తున్న ఫౌజీ సినిమా డిసెంబర్ మూడవ తేదీన రిలీజ్ కానున్నట్లు ఇప్పటికే చిత్రం బృందం ప్రకటించింది. అయితే ఈ సినిమా రిలీజ్ అయిన రెండు వారాల తర్వాత నందమూరి బాలయ్య సినిమా రిలీజ్ చేసేందుకు చిత్రం బృందం ప్లాన్ చేస్తోంది. నందమూరి బాలయ్య ఎక్కువ హిట్ టాక్ వస్తే సంక్రాంతి వరకు థియేటర్ ఉంటుందని మేకర్స్ భావిస్తున్నారు. దీనిపై త్వరలోనే పోస్టర్ ద్వారా అఫీషియల్ ప్రకటన రానుంది. కాగా ఈ మూవీలో నందమూరి బాలయ్య సరసన కాజల్ నటిస్తున్నారు.




# పోస్టర్‌తో సినిమాపై భారీ హైప్

1990 కాలం నేపథ్యంలో సాగే పీరియడ్ క్రైమ్ డ్రామాగా రూపొందుతున్న చిత్రం 'KJQ - King Jackie Queen'. ఇందులో 'దసరా', 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న దీక్షిత్ శెట్టి హీరోగా నటిస్తుండగా.. నూతన నటి శశి ఓదెల హీరోయిన్‌గా పరిచయం అవుతుంది. యుక్తి తరేజా మరో కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే వినూత్నమైన టైటిల్, ఆకట్టుకునే ఫస్ట్ లుక్ పోస్టర్, పవర్‌ఫుల్ టీజర్‌తో ఈ సినిమాపై అంచనాలు ఏర్పడ్డగా.. తాజాగా విడుదల తేదీని మేకర్స్ ప్రకటించారు. 'కేజేక్యూ - కింగ్ జాకీ క్వీన్' ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 7న ప్రేక్షకుల ముందుకు రానుందని తెలిపారు. రిలీజ్ డేట్ పోస్టర్‌లో ముగ్గురు ప్రధాన పాత్రలను స్ప్లిట్ ఫ్రేమ్‌లో చూపించారు. మధ్యలో శశి ఓదెల ఇంటెన్స్ లుక్ లో ఆకట్టుకోగా, తుపాకీ గురిపెట్టి కనిపిస్తున్న దీక్షిత్ శెట్టి పాత్ర ఆకట్టుకుంది. కుడివైపు చేతిలో సిగరెట్‌తో యుక్తి తరేజా కనిపిస్తూ తన పాత్రలోని మిస్టరీని సూచిస్తున్నారు. కాగా.. ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన కేకే గత ఏడాది కన్నుమూశారు. ఆయన సినిమాపై ఉన్న పాషన్, విజన్‌కి నివాళిగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు.

# బోల్డ్ హారర్ థ్రిల్లర్‌లో తమన్నా..

తమన్నా బాలీవుడ్‌లో ఆఫర్స్ పెరిగాక గ్లామర్ రోల్స్ మాత్రమే కాదు బోల్డ్ పాత్రలకు కూడా నో చెప్పడం లేదు. బ్యాడ్సాఫ్ బాలీవుడ్‌లో స్పెషల్ సాంగ్ కోసం విపరీతమైన స్కిన్ షో చేసిన మిల్కీ బ్యూటీ నెక్ట్స్ మరో బోల్డ్ స్టోరీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఐటమ్ సాంగ్స్ ఏ హీరోయిన్ కెరీర్‌నైనా కిల్ చేశాయేమో కానీ తమన్నా కెరీర్‌కు మాత్రం బూస్టప్ ఇచ్చాయి. ఇంకా చెప్పాలంటే స్పెషల్ సాంగ్స్‌తో కూడా కోట్లు కూడగట్టొచ్చని, ఆఫర్స్ పట్టొచ్చని ప్రూవ్ చేసింది. ఎంతో మంది స్టార్ బ్యూటీలకు ఇన్‌స్పిరేషన్‌గా మారింది. ఇంత వరకు ఓకే కానీ సౌత్‌లో హద్దులు మీరని గ్లామర్ షో చేసిన తమన్నా బాలీవుడ్ వెళ్లాక బోల్డ్ అండ్ రొమాంటిక్ సీన్స్‌లో రెచ్చిపోయి మరీ నటిస్తోంది.టాలీవుడ్‌లో చేస్తోన్న సినిమాలు ఫ్లాప్ కావడంతో ఆమెను లైట్ తీసుకుంటున్నారు ఇక్కడి మేకర్స్. కానీ బాలీవుడ్‌లో స్కిన్ షోతో బాగానే ఆఫర్స్ కొల్లగొడుతోంది. ఇప్పటికే చేతిలో వివాన్, రేంజర్, రోహిత్ శెట్టి సినిమాతో పాటు వి శాంతారం బయోపిక్ ఉన్నాయి. తాజాగా మరో క్రేజీ ప్రాజెక్ట్‌లోకి జాయిన్ అయ్యింది తమన్నా. బాలీవుడ్‌లో హారర్ ప్లస్ బోల్డ్ సిరీస్ థ్రిల్లర్ రాగిణి ఎంఎంఎస్ పార్ట్ త్రీలో యాక్ట్ చేస్తోంది మిల్కీ బ్యూటీ. రాగిణి3 సెట్స్‌లోకి ఎంటరైన పిక్ సోషల్ మీడియాలో షేర్ చేసుకుంది తమన్నా. ఈ మూవీని శశాంక్ ఘోష్ డైరెక్ట్ చేస్తున్నాడు. పార్ట్ వన్ అండ్ టూ కన్నా మరింత భయంకరంగా, బోల్డ్‌గా తెరకెక్కించబోతున్నారట మేకర్స్. ఇందులో సల్మాన్ రిలేటివ్ ఆయుష్ శర్మ, అమీర్ ఖాన్ కొడుకు జునైద్ ఖాన్, నర్గీస్ ఫక్రీ కీ రోల్స్ ప్లే చేస్తున్నారు. బాలాజీ మోషన్ పిక్చర్స్, టిప్స్ ఫిల్మ్స్, జై హో మీడియా వెంచర్స్ సంయుక్తంగా ఈ మూవీని నిర్మిస్తున్నాయి.




# కుర్రకారును ఫిదా చేస్తున్న ప్రీతి ముకుందన్

ప్రస్తుతం సౌత్ సినీ ఇండస్ట్రీలో ఎక్కువగా వినిపిస్తున్న యువ హీరోయిన్లలో పేర్లలో ప్రీతి ముకుందన్ ఒకరు. ఇటీవల విడుదలైన 'బ్లాస్ట్' సినిమాతో ప్రేక్షకులను అలరించిన ఈ భామ, తన నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది.ఆ చిత్ర విజయం ఆమెకు మంచి క్రేజ్ తీసుకురాగా, తాజాగా విడుదలైన 'హృదయం మురళి' సినిమాతో మరోసారి ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటోంది.ఇందులో కూడా మంచి ప్రాధాన్యం ఉన్న పాత్రలో నటించిన ప్రీతి తన నటనతో ఆకట్టుకుని ప్రస్తుతం సౌత్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. సినిమాల్లో క్లాస్ అండ్ డీసెంట్ లుక్‌తో ఆకట్టుకునే ప్రీతి ముకుందన్, సోషల్ మీడియా-లోనూ అదే స్టైల్‌ను కొనసాగిస్తోంది.తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. పలుచటి తెలుపు రంగు చీరకు స్కై బ్లూ స్లీవ్‌లెస్ బ్లౌజ్‌ను జత చేసి, తన అందాన్ని ఎంతో హుందాగా ఆవిష్కరించింది. నాజూకైన నడుము అందాలను హైలైట్ చేస్తూ ఇచ్చిన పోజులు అభిమానులను ఫిదా చేస్తున్నాయి.భారీ ఇయర్‌రింగ్స్‌తో మరింత స్టైలిష్‌గా మెరిసిన ప్రీతి తన కిల్లింగ్ లుక్స్‌తో సోషల్ మీడియాలో హీట్ పెంచేస్తోంది. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట భారీగా వైరల్ అవుతూ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.



Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**